ప్రజలకు / పాఠకులకు ముఖ్య విజ్ఞప్తి

"ప్రజాప్రశ్న" దినపత్రిక పేరు చెప్పుకొని ఎవరైనా డబ్బులు, విరాళాలు, ప్రకటనల పేరుతో నగదు లేదా ఇతర రూపంలో డిమాండ్ చేస్తే దయచేసి నమ్మవద్దు.

అలాంటి వ్యక్తుల వివరాలను వెంటనే మా దృష్టికి తీసుకురండి. ప్రజల ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత వ్యక్తులపై పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది.

- ప్రజాప్రశ్న యాజమాన్యం

PRAJA PRASHNA

ప్రజాప్రశ్న

RNI : TELTEL/2021/80267 తెలుగు దినపత్రిక



సంపుటి: 6 సంచిక: 143, పేజీలు - 08

బుధవారం, నవంబర్ 25, 2026 వెల: 5 రూ/.

హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

సర్కారు భూమికి కన్నం

దొంగ పత్రాలతో ఆక్రమణలు

'ప్రజాప్రశ్న' వెలుగులోకి తెచ్చిన భారీ భూ కుంభకోణం


▶ కథనంపై స్పందించిన మేడ్చల్ జిల్లా యంత్రాంగం ▶ సీసీఎల్ఏకు సమగ్ర నివేదిక పంపిన కలెక్టర్


▶ బాధ్యులపై చర్యలు తీసుకోవాలని టీఎస్ఎల్ఎస్ఏ ఆదేశాలు











అక్రమ నిర్మాణాలు - అమ్మకాలు

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఎకర భూమి కోట్లలో ఉంది. ఇదే అదనుగా కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి కోట్ల విలువచేసే భూములను అధికారులతో కలిసి స్వాహా చేస్తున్నారు. అధికారులు కూడా అధికారాన్ని అడ్డుపెట్టుకొని భూ కబ్జాలకు పూర్తిగా తమ సహాయ సహకారాలు అందిస్తూ కోట్లు గడిస్తున్నారు.మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఉప్పల్ మండలం బండ్లగూడ గ్రామంలోని సర్వే నంబర్ 36/5 లోని దాదాపు 10 ఎకరాల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమార్కులు నకిలీ పత్రాలు సృష్టించి స్వాహా చేసిన వైనం అందరికీ తెలిసిందే. దీనిని సామాజిక కార్యకర్త పట్నం బాబా గౌడ్ ఇచ్చిన ఆధారాలతో "ప్రజాప్రశ్న" దినపత్రిక వెలుగులోకి తీసుకురావడంతో, ప్రభుత్వానికి వందల కోట్ల నష్టం కలగకుండా అడ్డుకుంది. అసలు రాచకొండ కనకయ్య అనే వ్యక్తి స్వాతంత్ర్య సమరయోధుడు (ఫ్రీడమ్ ఫైటర్) కాకపోయినప్పటికీ, ఆయన పేరుతో తప్పుడు పత్రాలు సృష్టించి ప్రభుత్వ భూమిని ఆక్రమించారన్న భారీ కుంభకోణంపై 'ప్రజాప్రశ్న' పూర్తి ఆధారాలతో కథనాన్ని వెలుగులోకి తెచ్చింది. ఈ అక్రమాలపై వచ్చిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ యంత్రాంగం, ఉన్నతాధికారులు స్పందించారు.

సీసీఎల్ఏకు కలెక్టర్ సమగ్ర నివేదిక

ఈ భారీ భూ కుంభకోణంపై పూర్తి స్థాయిలో స్పందించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టర్, సమగ్ర నివేదికను భూ పరిపాలన ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ)కి పంపడం జరిగింది. అసలు రికార్డులలో ఎలాంటి అసైన్‌మెంట్ ఫైళ్లు, ఫైనల్ పట్టీలు లభించలేదని, కేవలం 1987-88 పహణీ నుంచి మాత్రమే అక్రమంగా రాచకొండ కనకయ్య పేరు వచ్చి చేరిందని నివేదికలో స్పష్టం చేశారు. హోమ్ శాఖ, విజిలెన్స్ విభాగాన్ని సంప్రదించగా రాచకొండ కనకయ్య స్వాతంత్ర్య సమరయోధుడు అనడానికి ఎలాంటి ఆధారాలు, రికార్డులు లభించలేదని స్పష్టమైంది.

తెలంగాణ రాష్ట్ర చట్టపరమైన సేవల అధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) సీరియస్

దొంగ స్వాతంత్ర్య సమరయోధుడు ధ్రువీకరణ పత్రాలు, నకిలీ పత్రాల ద్వారా 10 ఎకరాల సర్కారీ భూమి ఆక్రమణకు గురైన వైనంపై మరింత స్పష్టతనిస్తూ అధికారిక పత్రాలు వెలుగుచూశాయి. 08-07-2026 నాడు గౌరవనీయ తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సమర్పించిన ఫిర్యాదుపై 'ఆఫీస్ ఆఫ్ ది తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ' (టీఎస్-ఎల్ఎస్ఏ) తీవ్రంగా స్పందించింది.ఈ మేరకు టీఎస్ఎల్ఎస్ఏ పరిపాలనాధికారి (సీనియర్ సివిల్ జడ్జి హోదాలో) ప్రొసీడింగ్స్ నంబర్ రాక్.నెం.3620/టీఎస్ఎల్ఎస్ఏ/2026, తేదీ: 30.07.2026 ద్వారా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్‌కు అధికారికంగా లేఖ రాశారు. పిటిషనర్ ఫిర్యాదుపై ఇప్పటివరకు తీసుకున్న చర్యల నివేదికను వెంటనే సమర్పించాలని ఆ లేఖలో స్పష్టంగా ఆదేశించారు. ఇదే అంశానికి సంబంధించి గౌరవ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయానికి కూడా ఓసీజే ఆర్సీ.నెం. 1504/2026, తేదీ: 09.07.2026 ద్వారా సమాచారం అందించినట్లు ఆ పత్రంలో పేర్కొన్నారు.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన కొన్ని వ్యవస్థల అపవిత్ర ప్రమేయంతోనే ఇక్కడ నిరభ్యంతర పత్రాలు (ఎన్ఓసీలు) జారీ కావడం, జీహెచ్ఎంసీ అనుమతులు పొందడం జరిగిందని తీవ్రమైన విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ (సీసీఎల్ఏ) చట్టపరమైన సేవల అధికార సంస్థ (టీఎస్ఎల్ఎస్ఏ) మరింత గట్టిగా దృష్టి పెట్టడంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ప్రభుత్వ భూమిని కాపాడి, బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

కట్టుతప్పిన కాంగ్రెస్‌కు కళ్లెం వేస్తారా.?

- కొత్త ఇన్‌ఛార్జి బీఎం సందీప్ ముందున్న అసలు సవాల్ ఇదే!

హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల నూతన ఏఐసీసీ ఇన్‌ఛార్జిగా నియమితులైన బీఎం సందీప్ తన తొలి పర్యటనలోనే హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో వరుస సమీక్షా సమావేశాలు నిర్వహించారు. మీనాక్షి నటరాజన్ స్థానంలో బాధ్యతలు చేపట్టిన ఆయన, పొలిటికల్ అఫైర్స్ కమిటీ సమావేశంతో పాటు రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులతో విడివిడిగా ముఖాముఖీ భేటీ అయ్యారు. అయితే, ఈ తొలి సమావేశాల్లో ఆయన చేసిన ప్రసంగంలో పెద్దగా కొత్తదనం ఏమీ కనిపించలేదని, గతంలో వచ్చిన ఇన్‌ఛార్జిలు చెప్పినట్లుగానే అందరూ ఐక్యంగా పనిచేయాలి,

2లో..

రాజకీయాల్లో మా అమ్మను ఎంతో అవమానించారు

- రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ చైర్‌పర్సన్ సోనియా గాంధీ ఆత్మకథ 'బిలాంగింగ్: ఏ జర్నీ ఆఫ్ లవ్' పుస్తకం ఇటీవల విడుదలై రికార్డు స్థాయిలో కాపీలు అమ్ముడుపోతున్నాయి. ఈ నేపథ్యంలో సోనియా గాంధీ తన పిల్లలు కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా మధ్య ఆత్మీయ సంభాషణకు సంబంధించిన వీడియోను వారు మంగళవారం సోషల్ మీడియాలో పంచుకున్నారు.

2లో..

ప్రపంచ బ్యాంకు అండతో

రూ.40 వేల కోట్ల నిధులను సమీకరించాలి

- వ్యవసాయ శాఖ సమీక్షలో సీఎం చంద్రబాబు




అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని మరింత ఆధునికంగా, లాభసాటిగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. వ్యవసాయ, ఉద్యాన శాఖలపై సచివాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల సంభవించిన వరుస తుఫాన్లు, ఎల్ నినో విపత్తుల వంటి ప్రకృతి వైపరీత్యాల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో పంట నష్టాన్ని నివారించేలా సాగు విధానాల్లో మార్పులు తీసుకురావాలని సూచించారు. వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు, స్పష్టమైన ఫలితాలు, అధిక లాభాలు కనిపించాలని సీఎం చంద్రబాబు

2లో..

పల్నాడు స్కీమ్ ఆపుతానని రేవంత్ రెడ్డి ఎందుకు అనలేదు?

- చంద్రబాబుకు గురుదక్షిణ కోసమా?




హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కేఆర్ఎంబీ సమావేశంలో పల్నాడు తాగునీటి పథకంపై తెలంగాణ అధికారులు నోరు మెదపకపోవడం వెనుక ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి గురుదక్షిణ చెల్లించే ఉద్దేశం ఉందా అని సీఎం రేవంత్ రెడ్డిని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ప్రశ్నించారు. నిన్న జరిగిన కేఆర్ఎంబీ భేటీకి ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు హాజరైనప్పటికీ, సమావేశం అనంతరం ఏపీ ఈఎన్సీ బయటకు వచ్చి పల్నాడు పథకంపై అసలు చర్చే జరగలేదని, అదొక సమస్యే కాదని ప్రకటించారని హరీష్ రావు గుర్తుచేశారు. రాష్ట్రంలో ఇంత రచ్చ జరుగుతున్నా మన అధికారులు సమావేశానికి వెళ్లి నోరు మూసుకొని కూర్చున్నారని, ప్రభుత్వ పెద్దల ఆదేశాలు లేకుండా ఇంజనీర్లకు అంత ధైర్యం

2లో..

బలవంతపు ఏకగ్రీవాలు జరగొద్దు

- సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలు




అమరావతి (ప్రశ్న న్యూస్) ఆంధ్రప్రదేశ్‌లో 3 దశల్లో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు చేస్తున్న ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ (ఎస్ఈసీ) అనిల్‌చంద్ర పునేఠా సమీక్ష నిర్వహించారు. అమరావతి నుంచి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులతో మాట్లాడిన ఆయన, ఎన్నికల నిర్వహణలో శాంతిభద్రతలకే మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ముందుగానే సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి అక్కడ అదనపు భద్రతా బలగాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఏపీలో మిగతా 23 పట్టణ స్థానిక సంస్థలు, తొలి విడత పంచాయతీలకు నవంబర్ 26న ఎన్నికలు నిర్వహించనున్నారు.గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ఎక్కడా బలవంతపు ఏకగ్రీవాలు జరగకూడదని ఎస్ఈసీ అనిల్‌చంద్ర పునేఠా స్పష్టం చేశారు. ప్రశాంత వాతావరణంలో జరిగే ఏకగ్రీవాల కారణంగా ఇతర ప్రాంతాలకు భద్రతా బలగాల లభ్యత పెరుగుతుందని పేర్కొన్నారు. మొదటి దశ పంచాయతీ ఎన్నికల్లో 15 నుంచి 20 శాతం వరకు ఏకగ్రీవాలు జరుగుతాయని

2లో..

కోహెడ ఫ్రూట్ మార్కెట్ పనుల్లో వేగం పెంచాలి

- నాణ్యత విషయంలో రాజీ వద్దన్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) కోహెడలో ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. మార్కెట్ అభివృద్ధి పనులతో సమాంతరంగా రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి శాఖకు సంబంధించిన అంశాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష నిర్వహించారు. నగరాభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పన, ట్రాఫిక్ సమస్యల పరిష్కారం, చెరువుల పునరుద్ధరణ,

2లో..

కట్టుతప్పిన కాంగ్రెస్‌కు కళ్లెం వేస్తారా.?

విభేదాలు పక్కనపెట్టి రాహుల్ గాంధీని ప్రధాని చేసేందుకు కృషి చేయాలి వంటి సాధారణ సుభాషితాలనే వల్లెవేశారని అభిప్రాయపడుతున్నారు.

గాడి తప్పుతున్న ఎమ్మెల్యేలు

ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య ఐక్యత కంటే కూడా అదుపు తప్పుతున్న క్రమశిక్షణ. అధికారంలోకి వచ్చిన మూడేళ్లలోనే సొంత పార్టీ ఎమ్మెల్యేలు, సీనియర్ నేతలు బాహాటంగానే ప్రభుత్వ పనితీరుపై, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై తీవ్రస్థాయిలో ఆరోపణలు గుప్పిస్తున్నారు. ముఖ్యంగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వంటి నేతలు బహిరంగ వేదికలపైనే ప్రభుత్వాన్ని ఇరుకున పెట్టేలా వ్యాఖ్యలు చేస్తుండటం ఢిల్లీ అధిష్టానానికి సైతం తలనొప్పిగా మారింది. నాలుగు గోడల మధ్య పరిష్కరించుకోవాల్సిన అంతర్గత విభేదాలు నిత్యం మీడియాలో, సోషల్ మీడియాలో చర్చనీయాంశమవుతుండటంతో ప్రతిపక్షాలకు ఆయుధాలు అందించినట్లవుతోంది.

రాజగోపాల్‌ను బుజ్జగించగలరా.?

ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కేవలం ఐక్యతా మంత్రం జపిస్తే సరిపోదని, బహిరంగ విమర్శలకు దిగే నేతలను కట్టడి చేయడానికి ఒక కఠినమైన, పక్కా ఫార్ములాను అమలు చేయాల్సిన అవసరం ఉందని పార్టీ శ్రేణులే చర్చించుకుంటున్నాయి. ఇప్పటికే ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్ ద్వారా కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి పిలుపు పంపి, ఇన్‌ఛార్జి సందీప్‌తో భేటీ కావాలని సూచించడం ఒక ప్రాథమిక అడుగుగా కనిపిస్తోంది. అయితే, ఇలాంటి భేటీలు కేవలం సర్దిచెప్పడానికే పరిమితమవుతాయా, లేక పార్టీ గీత దాటితే వేటు తప్పదన్న స్పష్టమైన హెచ్చరికలు జారీ చేస్తారా అన్నది వేచి చూడాలి.

పార్టీకి , ప్రభుత్వానికి మధ్య సమన్వయం

పార్టీకి , ప్రభుత్వానికి మధ్య సమన్వయం సాధించడం బీఎం సందీప్ ముందున్న అతిపెద్ద పరీక్ష. నల్గొండ బ్రదర్స్ మధ్య విభేదాల నుంచి మంత్రుల మధ్య సమన్వయ లోపం వరకు అనేక సున్నితమైన అంశాలను ఆయన చక్కదిద్దాల్సి ఉంది. గత ఇన్‌ఛార్జిల మాదిరిగానే కేవలం రివ్యూ మీటింగ్‌లు, నివేదికల సేకరణకే పరిమితమైతే తెలంగాణ కాంగ్రెస్‌లోని గ్రూపు రాజకీయాలను నియంత్రించలేక కొత్త ఇన్‌ఛార్జి కూడా చేతులెత్తేసినట్లే అవుతుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరి, ఢిల్లీ అధిష్టానం అండతో బీఎం సందీప్ కఠిన చర్యలకు ఉపక్రమించి పార్టీని గాడిలో పెడతారా లేక పాత కథే పునరావృతమవుతుందా అన్నది ఆసక్తికరంగా మారింది.

రాజకీయాల్లో మా అమ్మను ఎంతో అవమానించారు

ఈ సంభాషణలో భాగంగా రాహుల్ గాంధీ తీవ్ర భావోద్వేగంతో మాట్లాడారు. రాజకీయాల్లో తన తల్లి ఎదుర్కొన్న అవమానాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో ప్రియాంక గాంధీ 1977 ఎమర్జెన్సీ అనంతర పరిస్థితులను గుర్తుచేసుకున్నారు.

ఆ విషయాలు పుస్తకంలో రాయాల్సింది: రాహుల్

తన తల్లి సోనియా గాంధీ రాసిన పుస్తకంలో చాలా మంది పట్ల ఆమె ఎంతో దయతో వ్యవహరించారని, కానీ రాజకీయాల్లో ఆమెపై జరిగిన దాడులు, కొందరి నిజస్వరూపం గురించి రాయలేదని రాహుల్ గాంధీ అన్నారు. ఆమె రాసిన పుస్తకంలో మరికొన్ని విషయాలు కూడా ప్రస్తావించి ఉండాల్సిందని తాను అమ్మకు చెప్పినట్లు రాహుల్ వెల్లడించారు. అయితే ఎవరినీ నొప్పించకుండా అందరి పట్ల దయతో వ్యవహరించడమే అమ్మ నైజమని, అందుకే ఆమె తన పుస్తకంలో చాలా మంది పట్ల ఉదారంగా వ్యవహరించారని పేర్కొన్నారు. అమ్మ ఆ విషయాల్ని ఎప్పుడూ చెప్పదని, బహుశా తానే ఏదో ఒకరోజు బయటపెడతాను అన్నట్లు రాహుల్ మాట్లాడారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన సోనియా గాంధీ– 'వయసు పెరిగే కొద్దీ వదిలేసి ముందుకు సాగడమే మంచిదని' తాను భావించినట్లు తెలిపారు. విదేశాల్లో పుట్టిన కారణంతోనే తన తల్లిని లక్ష్యంగా చేసుకున్నారని, అయినప్పటికీ ఆమె మాత్రం భారతీయ సంస్కృతిలో మమేకమయ్యేందుకు ఎంతో ప్రయత్నించారని ప్రియాంక గాంధీ కొనియాడారు.

ఆ మాట అన్నందుకు స్కూల్‌లో ఓ అబ్బాయిని కొట్టా: ప్రియాంక గాంధీ

ఇదే సంభాషణలో ప్రియాంక, రాహుల్ తమ చిన్ననాటి జ్ఞాపకాల్ని కూడా గుర్తుచేసుకున్నారు. ముఖ్యంగా 1977లో ఎమర్జెన్సీ తర్వాత ఇందిరా గాంధీ ఎన్నికల్లో ఓడిపోయిన నాటి కఠిన పరిస్థితుల గురించి ప్రియాంక వివరించారు. ఇందిరా గాంధీ ఓటమి తర్వాత తాము వేరే ఇంటికి మారామని, ఆ సమయంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఉండేవని అన్నారు. ఎన్నికల తర్వాత స్కూల్‌కు వెళ్లిన తొలి రోజు ఒక బాలుడు తన దగ్గరికి వచ్చి అన్న మాటలతో అతడ్ని చెంపదెబ్బ కొట్టినట్లు చెప్పుకొచ్చారు. మరోవైపు అప్పట్లో స్కూల్‌లో తన పక్కన ఎవరూ కూర్చునేవారు కాదని, తన ఏడో పుట్టినరోజుకు ఒక్క స్నేహితుడే వచ్చాడని రాహుల్ అప్పటి విషయాలు చెప్పారు.

ఆపరేషన్ సిందూర్‌లో చైనా పాత్రపై కాంగ్రెస్ ఆరోపణలు

మరోవైపు గతేడాది జరిగిన ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్థాన్ తరఫున చైనా కీలక పాత్ర పోషించిందని ఆరోపిస్తూ కాంగ్రెస్– మంగళవారం రోజు కేంద్రంపై విమర్శలు చేసింది. చైనా పాత్రను మోదీ ప్రభుత్వం ఇప్పుడు తక్కువ చేసి చూపుతోందని పార్టీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. గతేడాది పహల్గామ్ ఉగ్రదాడికి ముందు చైనా శాటిలైట్స్ ఆ ప్రాంతంపై 37 సార్లు అసాధారణ కదలికలు జరిపాయన్న మరో కథనాన్ని కూడా ఆయన ఎక్స్‌లో ప్రస్తావించారు. అలాంటి చైనా విషయంలో ప్రభుత్వం లొంగుబాటు ధోరణిని అవలంబిస్తుందని ఆరోపించారు.

బలవంతపు ఏకగ్రీవాలు జరగొద్దు

తాము ఆశించగా, దాదాపు 19 శాతం వరకు ఏకగ్రీవాలు నమోదయ్యాయని ఆయన వివరించారు.రాష్ట్రంలో తొలిదశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు ఎస్‌ఈసీ ఏర్పాట్లు చేస్తోంది. పోటీలో ఉన్న అభ్యర్థులు, ఏకగ్రీవమైన స్థానాల తుది జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారికంగా ప్రకటించింది. తొలి దశలో మొత్తం 3,949 గ్రామ పంచాయతీలకు నోటిఫికేషన్ విడుదల కాగా, వీటిలో 758 సర్పంచ్ స్థానాలు, 39,832 వార్డులకు గాను 14,727 వార్డు స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవాల్లో తిరుపతి జిల్లా 135 సర్పంచులు, 2,131 వార్డులతో రాష్ట్రంలోనే అగ్రస్థానంలో నిలవగా, అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి జిల్లాల్లో అత్యల్పంగా ఒక్కొక్కరు చొప్పున సర్పంచులు ఏకగ్రీవమయ్యారు.ఏకగ్రీవాలు పోగా మిగిలిన 3,191 సర్పంచ్ స్థానాలకు ఈ నెల 26న పోలింగ్ జరగనుండగా, 9,052 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అలాగే 25,105 వార్డు స్థానాలకు 53,678 మంది పోటీ పడుతున్నారు. గుంటూరు, విశాఖ జిల్లాలకు తొలి దశ ఎన్నికల నుంచి మినహాయింపు ఇచ్చారు. మరోవైపు, వార్డులన్నీ ఏకగ్రీవమై కేవలం సర్పంచ్ పదవికి మాత్రమే ఎన్నిక జరిగే గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల విలీనానికి ఎస్‌ఈసీ అనిల్‌చంద్ర పునేఠా అనుమతించారు. పంచాయతీరాజ్ కమిషనర్ ప్రతిపాదన మేరకు తీసుకున్న ఈ నిర్ణయంతో పోలింగ్, పోలీస్ సిబ్బందితో పాటు నిర్వహణ ఖర్చులు గణనీయంగా తగ్గనున్నాయి.

తొలి విడత ముఖ్యమైన తేదీలివే

ఎన్నికల నోటిఫికేషన్: నవంబర్ 13, 2026
ఆర్ఓ/ఈఓ ఎన్నికల నోటీసు జారీ: నవంబర్ 15
నామినేషన్ల స్వీకరణకు ఆఖరి తేదీ: నవంబర్ 17
నామినేషన్ల పరిశీలన: నవంబర్ 18, 2026
తిరస్కరించిన నామినేషన్లపై అప్పీల్: నవంబర్ 19
అప్పీళ్ల పరిష్కారం: నవంబర్ 20
నామినేషన్ల ఉపసంహరణకు ఆఖరి తేదీ: నవంబర్ 21, 2026
పోటీలోని అభ్యర్థుల తుది జాబితా ప్రకటన: నవంబర్ 21, 2026
పోలింగ్ తేదీ: నవంబర్ 26, 2026
రీపోలింగ్ (అవసరమైతే): నవంబర్ 27
ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన: నవంబర్ 26, 2026

బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థి ఆత్మహత్య



నిర్మల్ నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీలో విషాదం నెలకొంది. గోదావరి బ్లాక్ హాస్టల్ గదిలో ఉరేసుకుని సీఎస్ఈ విద్యార్థి సంపత్ (20) ఆత్మహత్య చేసుకున్నాడు.మృతుడు సిరిసిల్ల జిల్లా తంగళ్లపల్లికి చెందినవాడు. సోమవారం రాత్రి 8.30 గంటల సమయంలో ఘటన జరిగింది. భోజనానికి వెళ్లిన సహచర విద్యార్థులు తిరిగొచ్చేసరికి విగతజీవిగా సంపత్ పడివున్నాడు. వెంటనే బైంసా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు.

ప్రపంచ బ్యాంకు అండతో రూ.40 వేల కోట్ల నిధులను సమీకరించాలి

నాయుడు స్పష్టం చేశారు.

ఉద్యాన పంటల్లో కొత్త రకాలకు ప్రాధాన్యం

హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం, ప్రపంచ బ్యాంకు సహకారంతో సుమారు రూ.40 వేల కోట్ల నిధులను సమీకరించాలని, మిగిలిన రూ.60 వేల కోట్లను వివిధ పెట్టుబడుల ద్వారా సమకూర్చుకుని కార్యక్రమాలు చేపట్టాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. వీలైనంత త్వరలో హార్టికల్చర్ హబ్ పనులు ప్రారంభించాలని, ప్రతినెలా పురోగతిపై సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. ఇందులో ప్రకృతి వ్యవసాయం, మైక్రో ఇరిగేషన్‌కు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, ఉద్యాన పంటల్లో కొత్త రకాలను పరిచయం చేస్తూ ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించాలని తెలిపారు. ఉద్యానవన రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు, బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా 'హార్టికల్చర్ సమ్మిట్'ను నిర్వహించాలని అధికారులను సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. అలాగే ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని, పంటల ఉత్పత్తి నుంచి ప్రాసెసింగ్, మార్కెటింగ్ వరకు సమగ్ర వ్యవస్థను అభివృద్ధి చేయాలని సూచించారు. ఉద్యానవన పంటల సాగుతో కరువు పరిస్థితులను అధిగమించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. ఉద్యానవన సాగులో అన్ని రాష్ట్రాల కంటే ఏపీ ముందుందని అధికారులు వివరించారు. వ్యవసాయంలో ఆధునిక యంత్రాల వినియోగాన్ని పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. అందుబాటులో ఉన్న ఆధునిక వ్యవసాయ యంత్రాలను ప్రదర్శించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలన్నారు. ఆధునిక పంటల సాగును ప్రోత్సహించడంతో పాటు కొత్త రకాల పంటలను రైతులకు పరిచయం చేయాలని, భూసార పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రైతులతో పాటు కౌలు రైతుల ప్రయోజనాలను కూడా కాపాడాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు.

తుఫాన్లను తట్టుకునేలా పంటల సాగు క్యాలెండర్

తుఫాన్ల కారణంగా పంటలకు నష్టం వాటిల్లకుండా అవసరమైతే పంటల సాగు క్యాలెండర్‌ను ముందుకు జరపాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి సాగును ముందుగానే ప్రారంభించి తుఫాన్ల ప్రభావం పంటలపై పడకుండా చూడాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగు చేసిన వరి పంటలకు ఇటీవల సంభవించిన తుఫాన్లతో పెద్దగా నష్టం వాటిల్లలేదని, దీనిపై వరి రైతుల్లో అవగాహన కల్పించాలని సీఎం చంద్రబాబు నాయుడు సూచించారు. ప్రతి పంట సీజన్ ప్రారంభానికి ముందే సమగ్ర యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు సూచించారు. వాతావరణ పరిస్థితులు, మార్కెట్ అవసరాలు, నీటి లభ్యత, పంటల సాగు కాలం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. 2027-28 నాటికి 26.5 లక్షల మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేసేలా ప్రోత్సహించాలని, ప్రకృతి వ్యవసాయాన్ని మరింత విస్తరించాలని తెలిపారు. రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించే రైతులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక ప్రోత్సాహకాలను వినియోగించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఈ అంశానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన జీవోను ఉటంకిస్తూ మరోసారి కేంద్రానికి లేఖ రాయాలని తెలిపారు. అలాగే, కరువు పరిస్థితులను ఎదుర్కొనేందుకు సమర్థ నీటి నిర్వహణ చేపట్టాలని సీఎం సూచించారు. జలధార-2 పనులను మార్చి నాటికి పూర్తి చేయాలని, అవసరమైతే జలధార-3 కార్యక్రమాన్ని కూడా చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలని తెలిపారు. రాష్ట్రంలో వర్షపాతం ఎంత నమోదవుతోంది, భూగర్భ జలాల లభ్యత ఎంత ఉందనే అంశాలపై కచ్చితమైన సమాచారం అందుబాటులో ఉండాలని, వర్షపు నీటి వినియోగం, భూగర్భ జలాల సంరక్షణకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలని సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశించారు.

రైతుల కోసం అన్ని సేవలూ ఒకే యాప్‌లోకి

వ్యవసాయం, ఆక్వా, హార్టికల్చర్ రంగాలకు సంబంధించిన సేవలన్నింటినీ ఒకే యాప్ పరిధిలోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచించారు. రైతులకు అవసరమైన సమాచారం, సాగు సూచనలు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ఒకే వేదిక ద్వారా అందుబాటులోకి తేవాలని తెలిపారు. రైతు సేవా కేంద్రాల నుంచి క్షేత్రస్థాయి సమాచారం సేకరించి ఏడాది పొడవునా రాష్ట్రంలో పచ్చదనం ఉండేలా ప్రణాళిక రూపొందించాలని సీఎం సూచించారు. అగ్రిటెక్‌పై ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించి, దాని సమర్థ వినియోగంపై అధికారులకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలో పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచాలని ముఖ్యమంత్రి సూచించారు. మేకలు, గొర్రెల పెంపకాన్ని ప్రోత్సహించి పశుసంపదను పెంచాలని, వీబీ-జీ రామ్-జీ పథకాన్ని పశుసంపద అభివృద్ధికి ఏ మేరకు వినియోగించుకోవచ్చో అధ్యయనం చేయాలని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు.

12.64 లక్షల హెక్టార్లలో పంట నష్టం

ఈ ఏడాది ఖరీఫ్‌లో ఎల్‌నినో కరువు పరిస్థితులు, అర్నబ్, మురసు తుఫాన్లు, భారీ వర్షాల కారణంగా 26 జిల్లాల్లో మొత్తం 12.64 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లినట్లు అధికారులు వివరించారు. ఇందులో 9.67 లక్షల హెక్టార్లలో ఎల్‌నినో కరువు ప్రభావంతో పంటలు దెబ్బతిన్నాయి. అర్నబ్ తుఫాను కారణంగా 13 జిల్లాల్లో 3.82 లక్షల మంది రైతులకు చెందిన పంటలు దెబ్బతినగా, మురసు తుఫాను ప్రభావంతో 9 జిల్లాల్లో 52,402 మంది రైతులకు చెందిన పంటలకు నష్టం వాటిల్లింది. తుఫాన్ల కారణంగా దెబ్బతిన్న పంట నష్టం వివరాలతో నివేదికను కేంద్ర ప్రభుత్వానికి అందించినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా దెబ్బతిన్న పంటలకు మొత్తం రూ.2,743 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీని అధికారులు ప్రతిపాదించారు. రాష్ట్రంలో 11.55 లక్షల హెక్టార్ల సాగు విస్తీర్ణం పంటల బీమా పరిధిలో ఉందని అధికారులు తెలిపారు. నష్టపోయిన పంటలకు రూ.1,732 కోట్ల బీమా క్లెయిమ్‌లు వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి రైతు బీమా పరిధిలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. బీమా కింద ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీతో పాటు బీమా పరిహారం కూడా అందే అంశంపై సమగ్ర అవగాహన కల్పించాలని తెలిపారు. డిజి రైతు బజార్ ప్రారంభించాక ఇప్పటికి లక్షకు పైగా ఆర్డర్లకు పంపిణీ చేసినట్లు అధికారులు తెలిపారు. అలాగే మొబైల్ రైతు బజార్లు వచ్చే ఫిబ్రవరి కల్లా మరో 40 పెంచనున్నట్లు వివరించారు. ఈ సమీక్షలో వ్యవసాయ, ఉద్యాన శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో కిషన్ రెడ్డి భారీ పాదయాత్ర

– మూడు రోజుల పాటు 'నషా ముక్త భారత్' కార్యక్రమం



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) దేశ యువతను పెనుభూతంలా వేధిస్తున్న డ్రగ్స్ మహమ్మారిని తరిమికొట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళుతోంది. ప్రధానమంత్రి మోదీ పిలుపు మేరకు హైదరాబాద్ నగరంలో నేటి నుంచి మూడు రోజుల పాటు 'నషా ముక్త భారత్' పాదయాత్ర నిర్వహించనున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి వెల్లడించారు. 'హైదరాబాద్ వాక్స్ ఫర్ నషా ముక్త భారత్' పేరిట చేపట్టే ఈ యాత్ర రేపు అంబర్‌పేట్‌లో ప్రారంభమై, నవంబర్ 27న జూబ్లీహిల్స్‌లో ముగుస్తుంది. సుమారు 30 కిలోమీటర్ల మేర నగరంలోని ప్రముఖ కూడళ్ల మీదుగా ఈ పాదయాత్ర కొనసాగనుంది. కేంద్ర సామాజిక న్యాయం, సాధికారత మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న 'నషా ముక్త భారత్ అభియాన్'లో భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. ఈ సందర్భంగా కిషన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం దేశ యువతను వేధిస్తున్న సవాళ్లలో డ్రగ్స్ అతి ప్రధానమైనదని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే చాలామంది యువత మత్తుపదార్థాల బారినపడి తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని తెలిపారు.డ్రగ్స్ మహమ్మారి కారణంగా పంజాబ్ రాష్ట్రం పూర్తిగా నిర్వీర్యమైపోయిందని, అటువంటి పరిస్థితి ఇతర రాష్ట్రాలకు రాకూడదనే ఉద్దేశంతో ప్రధాని మోదీ 'నషా ముక్త్ భారత్' కోసం పనిచేయాలని నిర్ణయించారని ఆయన వివరించారు. డ్రగ్స్ వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయని అన్నారు. 2029 నాటికి దేశాన్ని మత్తుపదార్థాలు లేని సమాజంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ మహమ్మారిపై సాగే పోరాటంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ పాదయాత్రకు సినీ ప్రముఖులు చిరంజీవి, నాగార్జున, వెంకటేశ్, ప్రభాస్‌లతో పాటు పలువురు క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు ఇప్పటికే తమ పూర్తి మద్దతు ప్రకటించినట్లు కేంద్రమంత్రి తెలిపారు.

కోహెడ ఫ్రూట్ మార్కెట్ పనుల్లో వేగం పెంచాలి

ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణపై సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు.

కోహెడ ఫ్రూట్ మార్కెట్‌పై సమీక్ష

కోహెడలో నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ ఫ్రూట్ మార్కెట్ అభివృద్ధి పనుల పురోగతిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అడిగి తెలుసుకున్నారు. పనుల్లో వేగం పెంచాలని, నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. మార్కెట్ అభివృద్ధి పనులతో సమాంతరంగా రోడ్ల నిర్మాణాన్ని కూడా పూర్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

ఐఐఐటీ జంక్షన్ వద్ద ఫుట్ బ్రిడ్జి

సీఎంసీ పరిధిలోని ఐఐఐటీ జంక్షన్ వద్ద ఫుట్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి కమిషనర్ పలు డిజైన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. వాటిని పరిశీలించిన సీఎం రేవంత్ రెడ్డి పలు మార్పులు, సూచనలు చేశారు. ఫుట్ బ్రిడ్జి సమీపంలో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేసేలా ప్రణాళికలు రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు.

హైదరాబాద్‌లో పీఆర్‌టీఎస్ ఫేజ్-1

హైదరాబాద్‌లో పర్సనల్ ర్యాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్ ఫేజ్-1 అమలుకు సంబంధించి టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ వివరాలను అధికారులు సీఎంకు వివరించారు.
– కూకట్‌పల్లి నుంచి రాయదుర్గ్ మీదుగా బయోడైవర్సిటీ వరకు ఒక అలైన్‌మెంట్.
– బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి సచివాలయం, బషీర్‌బాగ్ మీదుగా రాణిగంజ్ వరకు మరో అలైన్‌మెంట్.
ఈ మార్గాల సాధ్యాసాధ్యాలను పరిశీలించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెక్లెస్ రోడ్, రాయదుర్గ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో పీఆర్‌టీఎస్ డిపోల నిర్మాణానికి అనువైన స్థలాలను గుర్తించాలని ఆదేశించారు. డిపోల సమీపంలో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. రూట్లు, డిపోల నిర్మాణం, ఇతర మౌలిక సదుపాయాలపై సమగ్ర అధ్యయనం చేసి కార్యాచరణ సిద్ధం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

చెరువుల పునరుద్ధరణకు ప్రాధాన్యం

నగరంలోని చెరువుల పునరుద్ధరణ, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో ఇప్పటివరకు సాధించిన పురోగతిని హైడ్రా కమిషనర్ రంగనాథ్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వివరించారు. చెరువుల పునరుద్ధరణలో భాగంగా అవసరమైన ప్రాంతాల్లో మురుగునీటి శుద్ధి కేంద్రాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలను వివరించారు. ఎస్టీపీల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. నగరంలోని పురాతన మెట్ల బావుల పునరుద్ధరణకు కూడా అవసరమైన చర్యలు చేపట్టాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. నగరాభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా నదుపాయాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన పనులను సమన్వయంతో వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు దిశానిర్దేశం చేశారు.

డిపో పరిసరాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ ఉండేందుకు అవసరమైన ప్రణాళికలు

ఫుట్ బ్రిడ్జి సమీపంలో మల్టీ లెవెల్ కార్ పార్కింగ్ ఏర్పాటు చేయాలని సీఎం రేవంత్ రెడ్డిసూచించారు. హైదరాబాద్ లో పిఆర్టీఏస్ ఫేజ్-1 కు సంబంధించి టెక్నో ఎకానమీ ఫీజిబిలిటీని సీఎంకు అధికారులు వివరించారు. కూకట్ పల్లి నుంచి రాయదుర్గ్ మీదుగా బయో డైవర్సిటీ వరకు అలైన్ మెంట్ సాధ్య సాధ్యాలను సీఎం రేవంత్ రెడ్డికి అధికారులు తెలిపారు.బేగంపేట మెట్రో స్టేషన్ నుంచి సెక్రటేరియట్, బషీర్ భాగ్ మీదుగా రాణీ గంజ్ వరకు అలైన్ మెంట్ ప్రతిపాదనలను సీఎంకు అధికారులు వివరించారు. నెక్లెస్ రోడ్, రాయదుర్గ్, పీపుల్స్ ప్లాజా పరిసరాల్లో పిఆర్టీఏస్ డిపోలను నిర్మించేందుకు అనువైన స్థలాలను గుర్తించి, సాధ్యాసాధ్యాలను అధ్యయనం చేయాలని సీఎం సూచించారు. డిపో పరిసరాల్లో మల్టీ లెవెల్ పార్కింగ్ ఉండేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

పల్నాడు స్కీమ్ ఆపుతానని రేవంత్ రెడ్డి ఎందుకు అనలేదు?

ఎక్కడిదని నిలదీశారు.

పల్నాడు స్కీమ్‌ను ఆపుతానని ఎందుకు చెప్పలేదు..

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డే స్వయంగా చంద్రబాబుకు గురుదక్షిణలో భాగంగా ఈ పథకానికి అంగీకరించారని, అందుకే భేటీలో మాట్లాడవద్దని ఇంజనీర్లకు ముందే సూచించారని హరీష్ రావు ఆరోపించారు. నిన్న అంతసేపు మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి, పల్నాడు స్కీమ్‌ను ఆపుతానని ఒక్క ముక్క కూడా ఎందుకు అనలేదని ప్రశ్నించిన హరీష్ రావు, దొంగే 'దొంగ.. దొంగ' అని అరిచినట్లుగా తమపై ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు.పల్నాడు తాగునీటి పథకానికి 2025 జనవరి 24నే టెండర్లు పిలిచారని ఆధారాలతో సహా పేర్కొన్న మాజీ మంత్రి హరీష్ రావు, అప్పటి నుంచి రాష్ట్ర ప్రభుత్వం కుంభకర్ణుడిలా నిద్రపోతోందా అని మండిపడ్డారు. ప్రభుత్వ ఇంటెలిజెన్స్ కేవలం ప్రతిపక్షాల వెంట పడటానికే తప్ప రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటానికి పనిచేయదా అని నిలదీశారు. నవంబర్ 15, 16 తేదీల్లో పత్రికలు ఈ అంశాన్ని బయటపెట్టి, 18న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రెస్ మీట్ పెడితే గానీ ప్రభుత్వం కదలలేదని, కృష్ణా బోర్డు రాసిన లేఖ ప్రకారం తెలంగాణ ఈఎన్సీ 16-11-2026 తేదీతో బ్యాక్ డేట్‌లో ఉత్తరం రాశారని ఆరోపించారు.

రోమ్ చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లుగా రేవంత్ రెడ్డి

రోమ్ నగరం తగలబడుతుంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయించినట్లు, రాష్ట్రం కరువు కోరల్లో చిక్కుకొని, నల్గొండ జిల్లాకు అన్యాయం జరుగుతున్నా సీఎం రేవంత్ రెడ్డికి గానీ, నీటిపారుదల శాఖ మంత్రికి గానీ సోయి లేదని విమర్శించారు. ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ పోరాటానికి సిద్ధమైతే తప్ప ప్రభుత్వం కదలడం లేదన్నారు. గతంలో కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తామంటే కేసీఆర్ నల్గొండలో ఉద్యమానికి శ్రీకారం చుట్టాకే ప్రభుత్వం వెనక్కి తగ్గిందని గుర్తుచేశారు. అలాగే గోదావరిపై ఏడు ప్రాజెక్టుల రద్దు, గోదావరి--బనకచర్ల అనుసంధానం విషయంలోనూ బీఆర్ఎస్ బయటపెట్టాకే బ్యాక్ డేట్ ఉత్తరాలు రాస్తూ, మరోవైపు ఢిల్

మే నెల నుంచి తొలి బుల్లెట్ ట్రైన్

హైదరాబాద్ : దేశంలో తొలి బుల్లెట్ ట్రైన్ ప్రయాణం కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ శుభవార్త అందించారు. ప్రతిష్ఠాత్మక అహ్మదాబాద్-ముంబై హైస్పీడ్ రైల్ కారిడార్ పనులు శరవేగంగా తుది దశకు చేరుకుంటున్నాయని, వచ్చే ఏడాది మే లేదా జూన్ నెలలో బుల్లెట్ ట్రైన్ ట్రయల్ రన్ నిర్వహించేందుకు సిద్ధమవుతున్నట్లు ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు బెంగళూరులోని బీఈఎంఎల్ , ఐసీఎఫ్ సంస్థలు స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందిస్తున్న 'బీ28' (ఽ28) బుల్లెట్ రైలు కోచ్‌లు వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి సూరత్ డిపోకు చేరుకోనున్నాయి.మొత్తం 8 కోచ్‌లతో, 202 మీటర్ల పొడవు ఉండే ఈ రైలులో ఒకేసారి 557 మంది ప్రయాణించే వీలుంటుంది. అహ్మదాబాద్ నుంచి ముంబై మధ్య 508 కిలోమీటర్ల మేర నిర్మాణంలో ఉన్న ఈ కారిడార్ ప్రాజెక్టు తాజాగా మరో కీలక మైలురాయిని అధిగమించింది. గుజరాత్‌లోని సూరత్ నుంచి బిలిమోరా మధ్య సుమారు 50 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌పై ట్రాక్ నిర్మాణంతో పాటు 25 కేవీ ఓవర్ హెడ్ ఎక్విప్‌మెంట్ విద్యుదీకరణ పనులను నేషనల్ హైస్పీడ్ రైల్ కార్పొరేషన్ లిమిటెడ్ విజయవంతంగా పూర్తి చేసింది. అప్, డౌన్ రెండు లైన్లలోనూ విద్యుత్ సరఫరాను పరీక్షించారు. ట్రయల్ రన్ సమయంలో ఈ బుల్లెట్ రైలు గంటకు 250 కిలోమీటర్ల వేగంతో (గరిష్ఠంగా 280 కి.మీ. సామర్థ్యం) పట్టాలపై దూసుకెళ్లనుంది.మే నెలలో ప్రారంభమయ్యే సాంకేతిక పరీక్షలు రెండు నుంచి నాలుగు నెలల పాటు కొనసాగనున్నాయి.

అన్నీ సవ్యంగా సాగితే వచ్చే ఏడాది ఆగస్టు 15 నాటికి ప్రధాని నరేంద్ర మోదీ చేతుల మీదుగా సూరత్-బిలిమోరా మధ్య తొలి దశ బుల్లెట్ రైలు సేవలను ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని రైల్వే శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం 508 కిలోమీటర్ల కారిడార్‌లో 12 స్టేషన్లు ఉండగా, ఇందులో 21 కిలోమీటర్ల మేర భూగర్భ సొరంగం, సముద్ర గర్భంలో 7 కిలోమీటర్ల సొరంగ మార్గం నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ప్రస్తుతం సాధారణ రైళ్లలో ఆరు నుంచి ఏడు గంటలు పట్టే అహ్మదాబాద్-ముంబై ప్రయాణ సమయం కేవలం రెండు గంటలకు తగ్గిపోనుంది.

13 శాతం రేషన్ కార్డులు ఇన్‌క్లూజన్ ఎర్రర్

హైదరాబాద్ : దేశవ్యాప్తంగా కోట్లాది మంది పేదల ఆకలి తీర్చేందుకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థలో భారీ ఎత్తున అవకతవకలు జరుగుతున్నట్లు సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. 'ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన' కింద లబ్ధి పొందుతున్న వారిలో పెద్ద సంఖ్యలో అనర్హులు ఉన్నారని కేంద్ర ఆహార, ప్రజా పంపిణీ విభాగం నిర్వహించిన తాజా అధ్యయనంలో బట్టబయలైంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశంలోని 36 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 51,303 లబ్ధిదారుల కుటుంబాలపై ఈ సమగ్ర సర్వే నిర్వహించగా, మొత్తం లబ్ధిదారుల్లో 13.2 శాతం 'ఇన్‌క్లూజన్ ఎర్రర్' (అనర్హులను జాబితాలో చేర్చడం) ఉన్నట్లు అధికారులు గుర్తించారు.నిబంధనల ప్రకారం కేవలం ఆర్థికంగా వెనుకబడిన నిరుపేద కుటుంబాలకు మాత్రమే ఉచిత రేషన్ అందాల్సి ఉండగా, సంపన్న వర్గాలు సైతం ఈ పథకాన్ని దుర్వినియోగం చేస్తున్నట్లు సర్వేలో తేలింది. సొంత కార్లు ఉన్నవారు, ఇళ్లలో ఏసీలు (ఎయిర్ కండిషనర్లు) వినియోగిస్తున్నవారు, మూడు లేదా అంతకంటే ఎక్కువ గదులు ఉన్న పక్కా భవనాల్లో నివసిస్తున్నవారు కూడా ఉచిత రేషన్ బియ్యం తీసుకుంటున్నారు. వీరితో పాటు కుటుంబ సభ్యుల్లో ప్రభుత్వ ఉద్యోగులు ఉన్నవారు కూడా పేదల కోటాలో ఉచిత ఆహార ధాన్యాలు పొందుతున్నట్లు వెల్లడి కావడం విస్మయానికి గురిచేస్తోంది. పట్టణ ప్రాంతాల్లో 15.6 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 12.5 శాతం మేర ఈ అనర్హులు ఉన్నట్లు నివేదిక స్పష్టం చేసింది.ముఖ్యంగా పశ్చిమ బెంగాల్ (39.5 శాతం), త్రిపుర, తమిళనాడు రాష్ట్రాల్లో ఈ లోపాలు అత్యధికంగా నమోదయ్యాయి. దేశవ్యాప్తంగా సుమారు 81.35 కోట్ల మందికి ఉచిత రేషన్ అందిస్తున్న నేపథ్యంలో, అర్హులైన నిరుపేదలకు అన్యాయం జరగకుండా ప్రజా పంపిణీ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఆదాయపు పన్ను, రవాణా శాఖ, కార్పొరేట్ వ్యవహారాల శాఖల డేటాబేస్‌లతో రేషన్ కార్డుల వివరాలను అనుసంధానించి అనర్హులను గుర్తించే ప్రక్రియను వేగవంతం చేసింది. త్వరలోనే దేశవ్యాప్తంగా బోగస్, అనర్హుల రేషన్ కార్డులను తొలగించి, వారి స్థానంలో నిజమైన అర్హులకు కొత్త కార్డులు మంజూరు చేసేందుకు కేంద్రం కార్యాచరణ సిద్ధం చేసింది.

ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బ్రాండ్లపై తనిఖీలు

ముంబై : బిస్లరీ సంస్థ ఉత్పత్తుల్లో హానికారక రసాయనాలు ఉన్నట్టు వెలువడిన నివేదికలు ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ బ్రాండ్లపై తనిఖీలు చేపట్టాలనే నిర్ణయానికి వచ్చినట్టు ప్రభుత్వ వర్గాలు రాయిటర్స్ వార్తా సంస్థకు వెల్లడించాయి.

భారత ఆహార భద్రత, ప్రమాణాల ప్రాధికార సంస్థ బిస్లరీ ఇంటర్నేషనల్ మధ్య తలెత్తిన వివాదంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. బిస్లరీ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ నమూనా ఒకటి సురక్షితం కాదని తేలడంతో ఆ సంస్థపై విచారణకు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతించింది.అయితే, ఆ తర్వాత నిర్వహించిన పరీక్షల్లో బిస్లరీ నమూనాలు ఆహార భద్రతా నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని తేలినట్లు ప్రభుత్వ వర్గాలు రాయిటర్స్‌కు తెలిపాయి. అంతకుముందు, సురక్షితం కాదని గుర్తించిన కంపెనీ ప్యాకేజ్డ్ వాటర్ బ్యాచ్‌లను వెనక్కి తీసుకుంది.నాణ్యత ప్రమాణాలను అందుకోని ఉత్పత్తులు సెప్టెంబర్ 2025లో తమ గోవా ప్లాంట్‌లో తయారైన ఒక బ్యాచ్‌కు సంబంధించినవని బిస్లరీ వివరణ ఇచ్చ్చింది. సేకరించిన ఆరు నమూనాల్లో ఐదు నిబంధనలకు అనుగుణంగానే ఉన్నాయని, అయితే ఒక దాంట్లో మాత్రమే 'బ్రోమేట్' స్థాయిలు నిర్దేశిత పరిమితి కంటే ఎక్కువగా నమోదయ్యాయని కంపెనీ తెలిపింది.దీనిపై తాము అప్పీల్ చేయగా, ఆ నమూనాను రిఫరల్ ల్యాబొరేటరీకి పంపారని బిస్లరీ వెల్లడించింది. అక్కడ జరిగిన పరీక్షల్లో బ్రోమేట్ స్థాయిలు పరిమితికి లోబడే ఉన్నాయని తేలినప్పటికీ, 'పాలీసైక్లిక్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్స్' ఉన్నట్లు ల్యాబ్ ప్రత్యేకంగా గుర్తించిందని పేర్కొంది.అదే నమూనానుఆమోదించిన మరో ల్యాబ్‌లో స్వతంత్రంగా పరీక్షించగా, అందులో కూడా బ్రోమేట్ స్థాయిలు నిర్దేశిత పరిమితిలోనే ఉన్నాయని బిస్లరీ స్పష్టం చేసింది. ఈ పరీక్షా ఫలితాలను ఫిబ్రవరి 2026లో నియంత్రణ సంస్థకు సమర్పిం చామని, ఆ తర్వాత వారి నుంచి ఎటువంటి సమాచారం రాకపోవడంతో ఆ వివాదం ముగిసిపో యిందని తాము భావించినట్లు బిస్లరీ వివరించింది.కాగా, బిస్లరీతో పాటు మరికొన్ని సంస్థలకు చెందిన ఆహార ఉత్పత్తులపై ప్రాసిక్యూషన్‌కు ఎఫ్ఎస్ఎస్ఏఐ అనుమతించింది. వీటిలో వసంత్ మసాలా, టిట్-బిట్ ఫుడ్స్ ఇండియా, మిమాంస ఇండస్ట్రీస్, ఆశా కన్నెక్షనరీ వంటి సంస్థలలు ఉన్నాయి. దీంతో పాటుగా ఆహార ప్రమాణాలు పాటించని ఉర్మి లైఫ్‌సైన్సెస్ ఎల్ఎల్పీ, గౌర్ ఆయుర్వేదిక్ స్టోర్ లైసెన్స్‌లను కూడా తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. నిర్దేశిత భద్రతా ప్రమాణాలను అందుకోని ఆ ఉత్పత్తులు సురక్షితం కాదని తేలడంతో, ఆహార భద్రత ప్రమాణాల చట్టం, 2006 కింద బిస్లరీ సహా ఈ సంస్థలపై విచారణకు అనుమతి మంజూరు చేసింది.

కడియం శ్రీహరికి నిరసన సెగ

- హామీలపై నిలదీసిన గ్రామస్తుడిపై అనుచరుల దాడికి యత్నం

జనగామ జాఫర్‌గడ్ మండలం ఉప్పుగల్లు గ్రామంలో డియం శ్రీహరికి నిరసన సెగ తగిలింది. ఎన్నికల సమయంలో గ్రామానికి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని కడియం శ్రీహరిని గ్రామస్తుడు నిలదీసాడు. మూడేళ్లుగా గ్రామంలో ఎలాంటి అభివృద్ధి చేయలేదంటూ ప్రశ్నించాడు. దాంతో కడియం శ్రీహరి అనుచరులు ఆ గ్రామస్తుడిపై దాడికి ప్రయత్నించారు. వెంటనే అక్కడున్న వారు కలగచేసుకుని వారించారు. ఏమైనా ఉంటే తర్వాత మాట్లాడుకుందామంటూ కడియం శ్రీహరి దాటవేసారు.

విద్యార్థులతో కలిసి నృత్యం చేసిన విదేశీయులు

- ఆశ్రమ పాఠశాలలో సోలార్ లైట్లు ఏర్పాటు చేస్తాం

జైసూర్ రాసిమెట్ట ఆశ్రమ పాఠశాల బాలికలలో చేతన్ గుడ్ టెక్స్ టైల్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జర్మనీ దేశస్థులుమిస్టర్ రైఫ్ హెల్మాన్ టతీ నోరెబెర్ట్ తబకేన్ డోరోతీ ఆగ్నేష్ జోసెఫ్ వాచ్ ఆమో జీన్స్ క్రోమ్మింగా మిస్టర్ శ్రీరంగా రాజన్ సందర్శించారు వారికి పాఠశాలలో విద్యార్థులు ఘణ స్వాగతం పలికారు అనంతరం పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ పాఠశాల సమస్యలు మౌలిక సదుపాయాల కొరకు నిధులు అందిస్తాం అని అన్నారు విద్యార్థులు మంచి విద్య అభ్యశించి ఉన్నత స్థాయికి ఎదగాలి అని అన్నారు సరమేడి దుంది రావు మాట్లాడుతూ మా పాఠశాలకు విదేశీయులు రావడం అభినందనీయం మా ఏజెన్సీ ప్రాంతంలో అన్ని పాఠశాలకు మంచిసదుపాయలు కల్పించి ఆదుకోవాలని కోరారుపాఠశలలో విద్యార్థులు సాంస్కృతి సంప్రదాయ నృత్యాలతో అందరికి తిలకించారు విద్యార్థులతో పాటు విదేశీయులు కూడా నృత్యం చేశారు మీ సంప్రదాయ నృత్యం చేయడం మాకు చాలా సంతోషంగా ఉంది అని అన్నారు వారితో సంస్థ యొక్క సభ్యులు తిరుపతి హెచ్ఏం అనిత సీఐ రమేష్ డాక్టర్ అశోక్ సార్ మెడి దుందే రావు సర్పంచ్ ఉయిక చందు అర్జున్ తదితరులు పాల్గొన్నారు

కమ్మని కాపు ఎవరి కోసం.?

- అంతా ఆ మంత్రి కనుసనల్లోలేనా.?

- బడాబాబుల ఆస్తులకు రక్షణ.. పేదల బతుకులకు శిక్ష


- 80 అడుగుల రహదారి ప్రతిపాదన 60 అడుగులకు..

ఇప్పుడు 45 అడుగుల కోసం ఒత్తిళ్లా.?

- గోదావరి పుష్కరాల అభివృద్ధిలో రాజకీయ జోక్యంపై అనుమానాలు

- సామాన్యుల పాట్టకొట్టి సంపన్నుల ఆస్తులు కాపాడుతున్నారా.?

- 30 ఏళ్లుగా జీవనోపాధి పొందుతున్న చిరు వ్యాపారులకు భరోసా ఏది.?



భద్రాచలం (ప్రశ్న న్యూస్) దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధికి, 2027లో జరగనున్న గోదావరి పుష్కరాలకు ప్రభుత్వం భారీ ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆలయ అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, రహదారుల విస్తరణ, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన వంటి అంశాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రుల వరకు పలుమార్లు ప్రకటించారు. భద్రాచలాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దుతామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్న మాటలు ఆచరణలో ఎంతవరకు అమలవుతున్నాయి? అభివృద్ధి పేరుతో సామాన్యుల జీవితాలను రోడ్డున పడేసి, సంపన్నుల ఆస్తులను కాపాడేందుకు తెరవెనుక ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ఇప్పుడు పట్టణంలో చర్చనీయాంశంగా మారాయి.

గోదావరి కరకట్ట కింద ఉన్న రహదారిని సుమారు 80 అడుగుల మేర విస్తరించేందుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రతిపాదిత అలైన్‌మెంట్ అమలులోకి వచ్చే సమయంలో కొంతమంది బడాబాబుల నిర్మాణాలు, ఆస్తులకు ఇబ్బందులు ఎదురవుతాయనే కారణంతో రాజకీయ స్థాయిలో మంతనాలు జరిగినట్లు స్థానికంగా ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో 80 అడుగుల ప్రతిపాదన 60 అడుగులకు కుదించినట్లు, ఇప్పుడు 45 అడుగులకు పరిమితం చేయాలంటూ మరికొందరు ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ ఆరోపణల్లో వాస్తవమెంత? రహదారి అలైన్‌మెంట్‌ను మార్చాల్సిన అవసరం ఏమిటి? ఎవరి ప్రయోజనాల కోసం ఈ మార్పులు జరుగుతున్నాయి? అన్న ప్రశ్నలకు ప్రభుత్వం, సంబంధిత అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

బడాబాబులకు ఒక న్యాయం.. పేదలకు మరో న్యాయమా.?

సుమారు మూడు దశాబ్దాలుగా కరకట్ట పరిసర ప్రాంతాల్లో చిన్నచిన్న దుకాణాలు ఏర్పాటు చేసుకొని కుటుంబాలను పోషించుకుంటున్న చిరు వ్యాపారులు ఇప్పుడు అభివృద్ధి పేరుతో ఖాళీ చేయించబడే పరిస్థితిని ఎదుర్కొంటున్నారని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 20 కుటుంబాల జీవనోపాధిపై ప్రభావం పడుతున్నప్పటికీ వారికి ప్రత్యామ్నాయ స్థలం, తగిన పరిహారం, పునరావాసంపై స్పష్టమైన హామీ లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది.ఒకవైపు రోజువారీ కూలీ చేసుకుంటూ, చిన్నపాటి వ్యాపారాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న పేదలను హడావుడిగా ఖాళీ చేయించేందుకు అధికారులు ప్రయత్నిస్తుంటే, మరోవైపు ఆస్తులు, అంతస్తులు కలిగిన కొందరి నిర్మాణాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అలైన్‌మెంట్ మార్పుల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయనే ఆరోపణలు ప్రజల్లో అసంతృప్తిని రేకెత్తిస్తున్నాయి.

పరిహారం పొందిన భూముల్లో మళ్లీ నిర్మాణాలా.?

గతంలో భూసేకరణ సందర్భంగా నష్టపరిహారం చెల్లించిన ప్రాంతాల్లో సైతం తిరిగి నిర్మాణాలు చేపడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అలాంటి నిర్మాణాలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ప్రభుత్వ భూములు, భూసేకరణ పరిధిలోని స్థలాల విషయంలో నిబంధనలు అందరికీ ఒకేలా వర్తించాలి కదా.? అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మంత్రుల ప్రకటనలకు.. క్షేత్రస్థాయి పరిస్థితులకు పొంతన ఎక్కడ.?

భద్రాచలం అభివృద్ధి పనులను గోదావరి పుష్కరాల కంటే ముందే పూర్తి చేస్తామని రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గతంలో ప్రకటించారు. అప్పటి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సైతం ఆలయ అభివృద్ధి పనుల మొదటి దశను పుష్కరాల నాటికి పూర్తి చేస్తామని వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కూడా భద్రాచలం ఆలయ అభివృద్ధి, ఘాట్ల నిర్మాణం, రహదారుల అనుసంధానంపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు.

మంత్రులు, ముఖ్యమంత్రి ప్రకటించిన అభివృద్ధి లక్ష్యాలన్నీ ప్రజలందరికీ ఉపయోగపడేలా అమలు కావాలి. కానీ కొంతమంది సంపన్నుల ప్రయోజనాల కోసం అభివృద్ధి ప్రణాళికల్లో మార్పులు జరుగుతున్నాయనే ఆరోపణలు వస్తే ప్రభుత్వం వాటిపై సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉంది.

అభివృద్ధి అంటే పేదల బతుకులను బలి ఇవ్వడమేనా.?

పుష్కరాల కోసం రహదారుల విస్తరణ అవసరమే. ఆలయ అభివృద్ధి కూడా అత్యంత ముఖ్యమే. అయితే అభివృద్ధి పేరుతో దశాబ్దాలుగా అక్కడే జీవిస్తున్న నిరుపేద కుటుంబాలను ఒక్కసారిగా రోడ్డున పడేయడం ఎంతవరకు సమంజసం? గతంలో భూసేకరణ సందర్భంగా పరిహారం పొందిన వారికి వర్తింపజేసిన న్యాయమైన విధానాలను ఇప్పుడు తొలగించాల్సిన అవసరం ఏమిటి? ఖాళీ చేయించే ప్రతి కుటుంబానికి తగిన పరిహారం చెల్లించి, ప్రత్యామ్నాయ స్థలం లేదా పునరావాసం కల్పించిన తర్వాతే చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు. సంపద, పలుకుబడి ఉన్నవారి ఆస్తుల రక్షణ కోసం అధికార యంత్రాంగం పరుగులు తీస్తుందనే ఆరోపణలు నిజమైతే అది ప్రజాస్వామ్య పాలనకే మచ్చ. పేదవాడి చిన్న దుకాణం అభివృద్ధికి అడ్డంకిగా కనిపిస్తే, పెద్దవారి భారీ నిర్మాణాలు మాత్రం ఎలా కనిపించడం లేదు? ప్రజాప్రయోజనాల కోసం రూపొందించిన ప్రణాళికలు వ్యక్తిగత ప్రయోజనాలకు అనుగుణంగా మారిపోతే అభివృద్ధి లక్ష్యం దెబ్బతినదా.?

ప్రభుత్వం స్పందించాలి.. బాధితులకు న్యాయం చేయాలి

కరకట్ట రహదారి అసలు ప్రతిపాదిత వెడల్పు ఎంత? 80 అడుగుల నుంచి 60 అడుగులకు మార్పు జరిగిందా.? 45 అడుగులకు కుదించాలనే ప్రతిపాదన ఉందా.? అలైన్‌మెంట్ మార్పునకు సంబంధించిన అధికారిక కారణాలేమిటి.? ప్రభావితమయ్యే చిరు వ్యాపారుల సంఖ్య ఎంత.? వారికి పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాల కల్పనపై ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలేమిటి.? అనే అంశాలపై జిల్లా కలెక్టర్, సంబంధిత శాఖల అధికారులు ప్రజలకు బహిరంగంగా వివరాలు వెల్లడించాలి. మంత్రి స్థాయిలో ఎలాంటి జోక్యం జరగలేదా.? జరిగితే దాని వెనుక ప్రజాప్రయోజనం ఏమిటి.? అన్న విషయాలను కూడా ప్రభుత్వం స్పష్టం చేయాలి.

అభివృద్ధి ముఖ్యమే.. కానీ పేదల బతుకులు అంతకంటే ముఖ్యం! గోదావరి పుష్కరాల పేరుతో భద్రాచలాన్ని సుందరంగా తీర్చిదిద్దే క్రమంలో అక్కడి పేద కుటుంబాల కన్నీళ్లను ప్రభుత్వం విస్మరించకూడదు. బడాబాబుల ఆస్తులకు ఒక న్యాయం, నిరుపేదల జీవనోపాధికి మరో న్యాయం అన్న భావన ప్రజల్లో కలగకుండా పారదర్శకంగా వ్యవహరించాలి. ప్రజల కోసం చేపట్టే అభివృద్ధి ప్రజలకే భారంగా మారకూడదు.

ప్రభుత్వ అధికారులకు జర్నలిస్టులు అంటే లెక్కలేదు

- పాలకుల అండదండతోనే అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న అధికారులు

- అవినీతి అక్రమాలపై కథనాలు వచ్చిన అధికారులలో భయం లేదంటే ప్రభుత్వ పాలన లేనట్లే

- అవినీతి, అక్రమాల గురించి జర్నలిస్టులు వార్తలు రాస్తే స్పందించని ఉన్నతాధికారులు

- కిందిస్థాయి సిబ్బంది, అధికారులు చేసే అవినీతి అక్రమాలలో ఉన్నతాధికారులకు వాటాలు ఉన్నాయా.?

- సామజిక కార్యకర్త, మానవ హక్కుల బాద్యులు, జాతీయ ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు గ్రహీత - బాపట్ల కృష్ణమోహన్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) అవినీతి, అక్రమాల గురించి మీడియాలో వార్తా కథనాలు వచ్చినా అధికారులు ఎందుకు స్పందించడం లేదు.? ఇలాంటి సందర్భాల్లో జర్నలిస్టులు చట్టపరమైన చర్యల కోసం, అంటే చట్టాలను ఉల్లంఘించిన అధికారులపై న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్నారు. పరిపాలనాపరమైన చర్యల కోసం, అంటే ప్రభుత్వ విధానాలు, నియమాలను అమలు చేయని అధికారుల గురించి జర్నలిస్టులు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం ఉండటం లేదు. ప్రభుత్వ అధికారిక సోషల్ మీడియా మాధ్యమాలైన ఎక్స్ ట్విట్టర్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ఈమెయిల్, ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు చేస్తున్నా అధికారులు స్పందించడం లేదు.ప్రస్తుతం కేంద్ర మరియు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించడానికి డిజిటల్ మాధ్యమాలను విస్తృతంగా ఉపయోగిస్తున్నాయి.ముఖ్యంగా జర్నలిస్టులు నిత్యం జీహెచ్ఎంసీ మరియు హెచ్ఎండీఏ పరిధిలో జరుగుతున్న అవినీతి అక్రమాల గురించి వార్త కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకొస్తున్నా స్పందన లేదు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి "అవినీతి అంతం రేవంత్ రెడ్డి పంతం" ఉత్తితేనా.?

అధికారులు మాత్రం తమ ఇష్టం వచ్చినట్లు చేస్తూ అవినీతికి పాల్పడుతున్నారు. కేవలం వార్తా కథనాల ఆధారంగానే కాకుండా, కొందరు జర్నలిస్టులు అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందన సరిగా ఉండటం లేదు. కొన్ని సందర్భాల్లో రాజకీయ ఒత్తిళ్ల వల్ల కూడా అధికారులు స్పందించడం లేదని అర్థమవుతుంది. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులకు స్థానిక నాయకులు లేదా ఉన్నత స్థాయి వ్యక్తుల అండదండలు ఉన్నప్పుడు, అధికారులు చర్యలు తీసుకోవడానికి వెనుకాడుతున్నారు. కొన్నిసార్లు సంబంధిత శాఖలోని అధికారులకు కూడా ఆ అక్రమాల్లో భాగస్వామ్యం ఉండటం వల్ల ఫైళ్లను దీర్ఘకాలంగా తొక్కిపెడుతున్నారు.వార్తలు రాసినా అధికారుల్లో కదలిక లేకపోతే, ఆ విషయాన్ని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసి, వార్తా కథనం కటింగ్‌తో పాటు ఆధారాలను జతచేసి, సంబంధిత శాఖ ఉన్నతాధికారికి ఉదాహరణకు జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ లేదా శాఖాధిపతికి నేరుగా ఫిర్యాదు చేసినా స్పందన ఉండటం లేదు. ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్ సెల్, ప్రజావాణి కార్యక్రమంలో నేరుగా ఫిర్యాదు చేసినా అధికారులు ఎలాంటి చట్టపరమైన చర్యలు తీసుకోవడం లేదు. ప్రజావాణిలో ఇచ్చిన పిటిషన్లను గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుంది, కానీ అలా పరిష్కారం కాని ఫిర్యాదులు వందల్లో ఉన్నాయి.వార్తా కథనం వచ్చిన తర్వాత అధికారులు స్పందించకపోతే, లేదా ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన తర్వాత అధికారులు ఏ చర్యలు తీసుకున్నారో తెలుసుకోవడానికి సమాచార హక్కు చట్టం ఆర్టీఐ ద్వారా దరఖాస్తు చేసుకుంటే, చాలా సందర్భాల్లో "మీరు అడిగిన సమాచారం మా కార్యాలయంలో అందుబాటులో లేదు" అనే సమాధానమే వస్తోంది. "ఫలానా తేదీన ప్రచురితమైన వార్తపై ఇచ్చిన ఫిర్యాదుపై తీసుకున్న చర్యల వివరాలు ఇవ్వండి" అని అడిగినా సరైన స్పందన ఉండదు.జర్నలిస్టులు రాసిన అవినీతి, అక్రమాల వార్తా కథనాలకు ప్రభుత్వ ఉద్యోగులు స్పందించకపోతే, అవినీతి నిరోధక శాఖ,ఏసీబీ, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి స్పందన లేదు, ఇది నిజం. ప్రభుత్వ అధికారులు తమ విధులను నిర్వర్తించడంలో విఫలమైనప్పుడు తెలంగాణ హై కోర్ట్ ను,లోకాయుక్తను, మానవ హక్కుల కమిషన్‌ను ఆశ్రయించిన సందర్భాల్లో, లోకాయుక్త స్వతంత్ర సంస్థ కాబట్టి అధికారులకు నోటీసులు జారీ చేసి విచారణ జరుపుతుంది. ఆ సమయంలో ప్రభుత్వ అధికారులు గౌరవ న్యాయస్థానాలకు తప్పుడు నివేదికలు ఇచ్చి, సంవత్సరాల తరబడి కేసులను పెండింగ్‌లో పెడుతున్నారు.ప్రజాధనం పెద్ద ఎత్తున దుర్వినియోగం అవుతున్నా, వ్యవస్థ మొత్తం నిర్లక్ష్యం వహిస్తున్నా, తగిన ఆధారాలతో హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం పిల్ వేసిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి.

ప్రైవేట్ టీచర్లకు తీపి కబురు

- గుర్తింపు కార్డుల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ వరకు..

సంక్షేమానికి సుప్రీంకోర్టు శ్రీకారం

- టీచర్ సంక్షేమ బోర్డు, కనీస వేతనాలు, హెల్త్ ఇన్సూరెన్స్‌కు కమిటీ ఏర్పాటు

దశాబ్దాల నిరీక్షణకు తెరపడేనా..

- త్వరితగతిన నివేదిక ఇవ్వాలని ఉపాధ్యాయ సంఘాల విజ్ఞప్తి



అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రైవేట్ విద్యా సంస్థల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, అధ్యాపకులకు ఎట్టకేలకు ఊరట కలిగించే పరిణామం చోటుచేసుకుంది. చాలాకాలంగా పరిష్కారానికి నోచుకోని ప్రైవేట్ టీచర్ల సమస్యలపై సుప్రీంకోర్టు స్పందించి కమిటీని నియమించడంపై ఉపాధ్యాయ వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తింపు కార్డులు, ఆరోగ్య బీమా, పీఎఫ్, ఈఎస్ఐ, కనీస వేతనాలు, నియామక పత్రాలు, పదవీ విరమణ ప్రయోజనాలు వంటి కీలక అంశాలకు పరిష్కారం లభించే దిశగా ఈ పరిణామం ఆశలు రేకెత్తిస్తోంది.ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో వేలాది మంది ఉపాధ్యాయులు, అధ్యాపకులు పనిచేస్తున్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్న వీరికి ఉద్యోగ భద్రత, ఆర్థిక భద్రత మాత్రం చాలాచోట్ల ప్రశ్నార్థకంగానే ఉంటోంది. నెలనెలా వేతనాల చెల్లింపుల్లో వ్యత్యాసాలు, కనీస వేతనాల అమలులో నిర్లక్ష్యం, ఉద్యోగ నియామకాలకు సంబంధించి సరైన పత్రాలు లేకపోవడం, వైద్య ఖర్చుల భారం వంటి సమస్యలు ఉపాధ్యాయులను వేధిస్తున్నాయి. ఎన్నో సంవత్సరాలుగా ఒకే సంస్థలో పనిచేస్తున్నప్పటికీ భవిష్యత్తుకు భరోసా కల్పించే పదవీ విరమణ ప్రయోజనాలు అందని పరిస్థితులు ఉన్నాయనే ఆవేదన వ్యక్తమవుతోంది.

ఈ నేపథ్యంలో ప్రైవేట్ విద్యా రంగంలో పనిచేస్తున్న బోధనా సిబ్బందికి సమగ్ర సంక్షేమ వ్యవస్థ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లు మరోసారి తెరపైకి వచ్చాయి. సుప్రీంకోర్టు కమిటీ నియామకంతో ఈ సమస్యలపై సమగ్ర అధ్యయనం జరిగి, తగిన పరిష్కార మార్గాలు సూచించబడతాయని ఉపాధ్యాయ సంఘాలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి.

ఉద్యోగ భద్రతకు బాటలు..

ప్రైవేట్ ఉపాధ్యాయులకు గుర్తింపు కార్డులు జారీ చేయడం ద్వారా వారి వృత్తిపరమైన గుర్తింపునకు గౌరవం లభించనుంది. హెల్త్ ఇన్సూరెన్స్ అమలైతే అనారోగ్య సమయాల్లో ఆర్థిక భారం తగ్గనుంది. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు అందుబాటులోకి వస్తే భవిష్యత్తు భద్రతతో పాటు వైద్యపరమైన రక్షణ లభిస్తుంది. కనీస వేతనాల అమలు ద్వారా యాజమాన్యాల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట పడే అవకాశం ఉంటుంది. ప్రతి ఉపాధ్యాయుడికి అపాయింట్‌మెంట్ లెటర్ ఇవ్వడం ద్వారా ఉద్యోగ సంబంధిత హక్కులకు చట్టబద్ధమైన ఆధారం ఏర్పడుతుంది.అంతేకాకుండా ప్రత్యేకంగా టీచర్ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడం, పదవీ విరమణ ప్రయోజనాలు కల్పించడం వంటి అంశాలు అమల్లోకి వస్తే ప్రైవేట్ విద్యా రంగంలో పనిచేస్తున్న లక్షలాది మంది బోధనా సిబ్బందికి ప్రయోజనం చేకూరనుంది.

ఇకపై తొమ్మిది రకాల ఆరోగ్య పరీక్షలు

- ఎన్‌సీడీ స్క్రీనింగ్‌లో మరో నాలుగు వ్యాధులు

- ఊబకాయం, కొవ్వు కాలేయం, శ్వాసకోశ, మానసిక సమస్యల గుర్తింపు

- వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

అమరావతి(ప్రశ్న న్యూస్) మారుతున్న జీవనశైలి.. పెరుగుతున్న దీర్ఘకాలిక వ్యాధులు.. చిన్న వయసులోనే చుట్టుముడుతున్న ఆరోగ్య సమస్యలకు అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య పరీక్షల పరిధిని విస్తరిస్తోంది. ఇప్పటివరకు ఐదు ప్రధాన అసంక్రమిత వ్యాధులకు నిర్వహిస్తున్న ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) స్క్రీనింగ్‌లో తాజాగా మరో నాలుగు వ్యాధులను చేర్చింది. ఇకపై 18 ఏళ్లు పైబడిన వారికి తొమ్మిది రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఊబకాయం, కొవ్వు కాలేయ వ్యాధి, దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలు, మానసిక ఆరోగ్య సమస్యలను ముందుగానే గుర్తించి చికిత్స అందించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తున్నారు. 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆరోగ్య పరీక్షలను త్వరలో ప్రారంభించేందుకు వైద్యారోగ్య శాఖ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం అధికారులతో వర్చువల్‌గా సమీక్ష నిర్వహించారు. పరీక్షల నిర్వహణ, సాంకేతిక విధానాలు, క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. గతంలో ఓటీపీ విధానంలో వివరాలు నమోదు చేయగా, ఈసారి ముఖ గుర్తింపు (ఎఫ్ఆర్ఎస్) విధానాన్ని అమలు చేయాలని ఆదేశించారు. ఆన్‌లైన్ వేదిక సిద్ధమైన వెంటనే స్క్రీనింగ్ ప్రారంభించేందుకు సన్నద్ధం కావాలని స్పష్టం చేశారు.

కొత్తగా నాలుగు వ్యాధులపై నిఘా..

ఇప్పటివరకు అధిక రక్తపోటు, మధుమేహం, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లపై పరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటికి అదనంగా ఊబకాయం, కొవ్వు కాలేయ వ్యాధి, దీర్ఘకాలిక శ్వాసకోశ వ్యాధులు, మానసిక ఆరోగ్య సమస్యలను గుర్తించనున్నారు. జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే గణాంకాల ప్రకారం అధిక బరువు, ఊబకాయం ఉన్న మహిళల శాతం 36.3 నుంచి 47.9కు, పురుషుల్లో 31.3 నుంచి 41.5కు పెరిగింది. ఈ నేపథ్యంలో బరువు పెరుగుదలను ప్రాథమిక దశలోనే గుర్తించి, ఆహారపు అలవాట్లు, వ్యాయామం, జీవనశైలిపై అవగాహన కల్పించనున్నారు.

ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం, థైరాయిడ్ సమస్యలున్న వారిలో కొవ్వు కాలేయ వ్యాధి ముప్పును కూడా పరిశీలిస్తారు. పొగాకు పొగ, వాయు కాలుష్యం, వృత్తిపరమైన దుమ్ము కారణంగా తలెత్తే దీర్ఘకాలిక శ్వాసకోశ సమస్యలను గుర్తించేందుకు ప్రత్యేక పరీక్షలు చేపడతారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు పరీక్షించి, అవసరమైన వారిని ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు పంపిస్తారు. అక్కడ స్పైరోమీటర్లతో శ్వాస సామర్థ్యాన్ని పరీక్షిస్తారు.

మానసిక సమస్యలకూ పరీక్షలు..

శారీరక ఆరోగ్యంతోపాటు మానసిక ఆరోగ్యానికీ స్క్రీనింగ్‌లో ప్రాధాన్యమివ్వనున్నారు. కుంగుబాటు, ఆందోళన, జ్ఞాపకశక్తి సమస్యలు, మానసిక భ్రాంతులకు సంబంధించిన ప్రశ్నలతో ప్రజల ఆరోగ్య పరిస్థితిని అంచనా వేస్తారు. మానసిక సమస్యల ముప్పు ఉన్నవారికి టెలీ మానస్ ద్వారా ఫోన్‌లో ప్రాథమిక పరీక్షలు నిర్వహిస్తారు. అవసరమైన వారిని జిల్లా మానసిక ఆరోగ్య కార్యక్రమం ద్వారా వైద్య సేవలకు అనుసంధానిస్తారు. మానసిక వైద్యుల సలహాలు, కౌన్సెలింగ్ కోసం 14416 నంబరుతో టెలీ మానస్ సేవలు అందుబాటులో ఉంటాయి.

10 లక్షల మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ పరీక్షలు..

రొమ్ము క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఎంపిక చేసిన గ్రామ ఆరోగ్య కేంద్రాల్లో 750 ఐబ్రెస్ట్ పరీక్షా పరికరాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. వీటి ద్వారా 10 లక్షల మంది మహిళలకు రొమ్ము క్యాన్సర్ సంబంధిత పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ పరికరాల ద్వారా రేడియేషన్ లేకుండానే పరీక్షలు చేసే అవకాశం ఉంది. అనుమానాస్పద ఫలితాలు వచ్చినవారికి శిక్షణ పొందిన వైద్యులు తదుపరి పరీక్షలు నిర్వహించి, అవసరమైన చికిత్సకు పంపిస్తారు.

ముఖ గుర్తింపుతో డిజిటల్ నమోదు..

స్క్రీనింగ్‌లో అక్రమాలకు, తప్పుడు నమోదులకు తావులేకుండా ముఖ గుర్తింపు విధానాన్ని అమలు చేయనున్నారు. అవసరమైన చోట బయోమెట్రిక్ వివరాలనూ సేకరిస్తారు. ఆరోగ్య గుర్తింపు సంఖ్య (అభా ఐడీ) జారీ చేసి, వ్యక్తుల వైద్య రికార్డులను అనుసంధానిస్తారు. పరీక్షలు, వ్యాధి నిర్ధారణ, చికిత్స, తదుపరి వైద్య పరిశీలన వివరాలన్నీ డిజిటల్ విధానంలో నమోదు చేస్తారు. అనుమానిత కేసులు, ఆసుపత్రులకు పంపిన రోగులు, చికిత్స ప్రారంభం, క్యాన్సర్ రోగుల కీమోథెరపీ దశలపై నిరంతర పర్యవేక్షణ ఉంటుంది.

వృద్ధులకు ఇంటి వద్దే వైద్య సేవలు..



దీర్ఘకాలిక అనారోగ్యంతో మంచానికే పరిమితమైనవారు, పక్షవాత బాధితులు, రోజువారీ పనులు చేసుకోలేని వృద్ధులు, చివరి దశ క్యాన్సర్ రోగులను ప్రత్యేకంగా గుర్తిస్తారు. గ్రామ ఆరోగ్య కేంద్రాల సిబ్బంది వారి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలిస్తారు. అవసరమైతే వైద్యాధికారులు, సంచార వైద్య సేవల ద్వారా చికిత్స అందిస్తారు. రోగుల సంరక్షణ, ఆహారం, పరిశుభ్రత, కదలికలపై కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు.

క్యాన్సర్ చికిత్సకు ప్రత్యేక కేంద్రాలు...

ప్రభుత్వ వైద్య కళాశాలల ఆసుపత్రుల్లో ఉన్న 17 క్యాన్సర్ నివారణ, పరీక్షా కేంద్రాలను మరింత బలోపేతం చేయనున్నారు. ప్రతి మంగళవారం, గురువారం 222వ నంబరు ఓపీ ద్వారా క్యాన్సర్ అనుమానితులకు పరీక్షలు, నిర్ధారణ, నివారణల సలహాలు అందిస్తారు. కీమోథెరపీ ప్రారంభించిన రోగులకు తదుపరి చికిత్స అందించేందుకు 23 డే కేర్ కీమోథెరపీ కేంద్రాలను అనుసంధానిస్తారు.

తొమ్మిది జిల్లా ఆసుపత్రుల్లోనూ క్యాన్సర్ నిర్ధారణ సేవలను బలోపేతం చేస్తారు. ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రుల్లో అసంక్రమిత వ్యాధుల ప్రత్యేక విభాగాలు, వృద్ధుల సంరక్షణ కేంద్రాలను అభివృద్ధి చేస్తారు. అవసరమైన చోట ఫిజియోథెరపీ సేవలు అందించేందుకు 333వ నంబరు ఓపీని కేటాయించనున్నారు.

మహిళా సంఘాల భాగస్వామ్యం...

ఆరోగ్య పరీక్షల్లో మహిళల భాగస్వామ్యం పెంచేందుకు గ్రామీణ, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలు, స్వయం సహాయక సంఘాల సహకారం తీసుకోనున్నారు. ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది, నూరా హెల్త్ బృందాలతో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. మందుల వినియోగం, తదుపరి పరీక్షలపై డిజిటల్ సందేశాలు పంపిస్తారు. కృష్ణా జిల్లాలోని బొల్లపాడు, ఎన్టీఆర్ జిల్లాలోని రాయపాడు గ్రామాల్లో ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నారు.

గోల్డ్ మ్యాన్ వ్యవహారంపై ఐటీ దృష్టి

హైదరాబాద్ : సోషల్ మీడియా వేదికలపై కిలోల కొద్దీ బంగారు ఆభరణాలు ధరించి, విలాసవంతమైన జీవనశైలితో యువతను ఆకర్షిస్తున్న 'గోల్డ్ మ్యాన్'ల వ్యవహారంపై ఇప్పుడు ఐటీ శాఖ దృష్టి సారించింది. తెలంగాణ గోల్డ్ మ్యాన్ గా గుర్తింపు పొందిన యాదగిరి చిన్న గౌడ్ అలియాస్ దర్గా చిన్న పహిల్వాన్ కేసు ఇప్పుడు సంచలనంగా మారింది. ఇటీవల ఆదాయపు పన్ను శాఖలోని బినామీ ఆస్తుల నిరోధక విభాగం రాయదుర్గంలోని ఓ భారీ నివాస భవనాన్ని, దాని అద్దె ఆదాయాన్ని తాత్కాలికంగా అటాచ్ చేయడం ఈ కేసులో కీలక మలుపు.శేరిలింగంపల్లి మండలం రాయదుర్గ నవ్ ఖల్సా గ్రామంలోని 222 చదరపు గజాల స్థలాన్ని 2019 జూలై 1న యాదగిరి ప్రణయ్ గౌడ్ పేరు మీద రిజిస్టర్ చేశారు. ఆ సమయంలో ప్రణయ్ కేవలం ఒక విద్యార్థి. ఎలాంటి పన్ను పరిధిలోకి వచ్చే ఆదాయం లేని వ్యక్తి రూ. 26.70 లక్షల విలువైన స్థలాన్ని ఎలా కొనుగోలు చేశారన్నది ఐటీ అధికారుల ప్రధాన ప్రశ్న. రిజిస్ట్రేషన్ పత్రాల ప్రకారం రూ. 1.7 లక్షలు నగదు రూపంలో, మిగిలిన రూ. 25 లక్షలు మూడు బ్యాంకు లావాదేవీల ద్వారా చెల్లించారు. ఆ తర్వాత ఆ స్థలంలో గ్రౌండ్ ఫ్లోర్‌తో పాటు ఐదు అంతస్తుల భవనాన్ని నిర్మించారు. ప్రతి అంతస్తులో రెండు 2ఱఱఐ ఫ్లాట్లు చొప్పున ఈ భారీ భవంతిని కట్టారు.

ఈ వ్యవహారంలో అసలు ట్విస్ట్ ఏమిటంటే.. ప్రణయ్ గౌడ్, చిన్న గౌడ్ కుమారుడి బావమరిది. విచారణలో భాగంగా ప్రణయ్ తన బావ ద్వారానే ఈ నిధులు సమకూరాయని, తనకు సొంతంగా ఆస్తి కొనే స్తోమత లేదని స్పష్టం చేశారు. మరోవైపు, ప్రణయ్ బావ ఇచ్చిన వాంగ్మూలంలో తానే స్థలం కొనుగోలుకు, భవన నిర్మాణానికి అవసరమైన డబ్బు ఇచ్చానని, నిర్మాణదారులకు చెల్లించడానికి తనఖా రుణం కూడా సేకరించానని అంగీకరించారు. అయితే ఈ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ఎలాంటి రుణ ఒప్పంద పత్రాలు లేకపోవడం అధికారుల అనుమానాలకు బలం చేకూర్చింది.ఈ భవనం ద్వారా నెలకు రూ. 3.20 లక్షల అద్దె ఆదాయం వస్తోంది. ఆస్తి పత్రాల ప్రకారం ప్రణయ్ యజమాని అయినప్పటికీ, అద్దె డబ్బులు మాత్రం ప్రణయ్ బావ భార్యకు చెందిన సిటీ యూనియన్ బ్యాంక్ ఖాతాలోకి జమయ్యాయి. ఆ ఆస్తిపై ఆమెకు ఎలాంటి యాజమాన్య హక్కులు లేకపోయినా, ఆమె ఖాతా నుంచి తిరిగి ఆమె భర్త ఖాతాలకు ఆ నగదు బదిలీ అయినట్లు ఐటీ అధికారులు ఆధారాలు సేకరించారు.

తాను ఇచ్చిన అప్పుకు బదులుగా నెలకు రూ. 1.76 లక్షల చొప్పున అద్దె రూపంలో తీసుకుంటున్నానని ప్రణయ్ బావ చెప్పిన సమాధానాన్ని అధికారులు తోసిపుచ్చారు. ఉమ్మడి లీజు ఒప్పందాలు, నగదు బదిలీ మార్గాలను విశ్లేషించిన ఐటీ విభాగం, బినామీ ఆస్తుల లావాదేవీల నిషేధ చట్టం ప్రకారం నవంబర్ 17న జాయింట్ కమిషనర్ అనుమతితో ఈ ఆస్తిని నిషేధిత జాబితాలో చేర్చారు. తెలంగాణ స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సమాచారం అందించి, తదుపరి ఉత్తర్వులు వెలువడే వరకు ఈ ఆస్తిని విక్రయించకుండా లేదా బదిలీ చేయకుండా నిషేధం విధించారు.

ఈ మొత్తం వ్యవహారం వెలుగులోకి రావడానికి ప్రధాన కారణం చిన్న గౌడ్ ఇచ్చిన టీవీ, యూట్యూబ్ ఇంటర్వ్యూలే. 2026 ఏప్రిల్ 3న ఐటీ అధికారులు ఆదాయపు పన్ను చట్టం కింద ఆయన నివాసంలో సోదాలు నిర్వహించారు. ఆ సమయంలో ఆయన వద్ద లభించిన 900 గ్రాముల బంగారంలో, 700 గ్రాములకు సరైన లెక్కలు లేకపోవడంతో అధికారులు వాటిని జప్తు చేశారు. ఆ బంగారం విలువ సుమారు రూ. కోటి ఉంటుందని, అద్దెలు, భూలావాదేవీల ద్వారా అది సమకూరిందని చిన్న గౌడ్ పేర్కొన్నప్పటికీ, సరైన ఆధారాలు చూపలేకపోయారు. విడ్డూరమేమిటంటే, కోట్ల రూపాయల ఆస్తులు, కిలోల కొద్దీ బంగారం ప్రదర్శించే ఆయన తన ఐటీ రిటర్నుల్లో మాత్రం కేవలం రూ. 4 లక్షల ఆదాయాన్ని మాత్రమే చూపించారు.ప్రస్తుత డిజిటల్ యుగంలో పన్ను ఎగవేతదారులను పట్టుకోవడానికి దర్యాప్తు సంస్థలు కేవలం బ్యాంకు ఖాతాలపైనే ఆధారపడటం లేదు. సోషల్ మీడియా పోస్టులు, యూట్యూబ్ వీడియోలు, జీవనశైలి ప్రదర్శనలను కూడా ఆధారాలుగా తీసుకుని 'డేటా అనలిటిక్స్' ద్వారా విశ్లేషిస్తున్నాయి. ఆదాయానికి మించిన ఆస్తులను బినామీ పేర్లతో దాచిపెట్టవచ్చనే పాతకాలపు ఆలోచనలకు ఈ కేసు ఒక గట్టి హెచ్చరిక. పారదర్శకమైన ఆర్థిక లావాదేవీలు లేకపోతే, అక్రమ మార్గంలో కూడబెట్టిన సంపద ఏదో ఒకరోజు చట్టం ఉచ్చులో చిక్కక తప్పదని ఈ ఘటన మరోసారి రుజువు చేస్తోంది.

తూకాల్లో తేడా.. కొలతల్లో మాయాజాలం

- ప్రజల జేబులకు చిల్లులు.. అధికారుల విధులకు తాళాలు- గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో కానరాని తనిఖీలు

- వ్యాపారుల ఇష్టారాజ్యం.. వినియోగదారులకు నిలువునా మోసం- కాగితాలకే పరిమితమవుతున్న పర్యవేక్షణ.. ఉన్నతాధికారులు స్పందించేది ఎప్పుడు.



అమరావతి (ప్రశ్న న్యూస్) ప్రజలు నిత్యం నిత్యావసర వస్తువుల నుంచి కూరగాయలు, పండ్లు, కిరాణా సరుకుల వరకు ప్రతి వస్తువును కొనుగోలు చేస్తున్నారు. ప్రతి కొనుగోలులోనూ సరైన తూకం, కొలత ఉండాల్సిందే. కానీ కొన్ని వ్యాపార సంస్థల్లో తూనికలు, కొలతల విషయంలో అక్రమాలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినియోగదారులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. కిలోకు బదులు తక్కువ బరువు, లీటరుకు బదులు తక్కువ పరిమాణం అందితే నష్టపోయేది సామాన్య వినియోగదారుడే. ఇలాంటి అక్రమాలను అరికట్టాల్సిన తూనికలు, కొలతల శాఖ అధికారులు మాత్రం క్షేత్రస్థాయిలో ఎంతమేరకు పర్యవేక్షణ చేస్తున్నారన్నది ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. ముఖ్యంగా గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల పరిధిలో తూనికలు, కొలతల శాఖ తనిఖీలపై ప్రజల్లో అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మార్కెట్లు, కూరగాయల దుకాణాలు, కిరాణా షాపులు, సూపర్ మార్కెట్లు, వాణిజ్య సంస్థల్లో తూనిక యంత్రాల పనితీరును అధికారులు క్రమం తప్పకుండా పరిశీలిస్తున్నారా? ధ్రువీకరణ గడువు ముగిసిన యంత్రాలను గుర్తిస్తున్నారా? తూకాల్లో మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటున్నారా? అనే ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు రావాల్సి ఉంది.

తూకం యంత్రాల్లోనే మాయాజాలమా..

ప్రస్తుతం సంప్రదాయ తూనిక రాళ్ల స్థానంలో డిజిటల్ కాంటాలు విస్తృతంగా వినియోగంలోకి వచ్చాయి. అయితే డిజిటల్ యంత్రాలు ఉన్నంత మాత్రాన తూకం కచ్చితంగా ఉంటుందనే గ్యారంటీ లేదు. యంత్రాల్లో సాంకేతిక మార్పులు, తప్పుడు సెట్టింగులు, ధ్రువీకరణ లేని పరికరాల వినియోగం వంటి అంశాలపై నిరంతర నిఘా అవసరం. తూకం సరిగ్గా చూపిస్తుందా లేదా అన్నది సంబంధిత అధికారులు తనిఖీల ద్వారా నిర్ధారించాలి. కానీ క్షేత్రస్థాయి తనిఖీలు ఎంత తరచుగా జరుగుతున్నాయన్నది ప్రజలకు తెలియాల్సి ఉంది.

మార్కెట్లలో తనిఖీలు ఏవీ...

కూరగాయల మార్కెట్లు, పండ్ల దుకాణాలు, మాంసం విక్రయ కేంద్రాలు, కిరాణా దుకాణాల్లో ప్రతిరోజూ వేలాది లావాదేవీలు జరుగుతుంటాయి. చిన్న మొత్తంలో జరిగే తూకం తేడా కూడా రోజులు, నెలలు గడిచేకొద్దీ వినియోగదారులకు పెద్ద మొత్తంలో నష్టాన్ని కలిగించే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితుల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి తూనిక యంత్రాలను పరీక్షించాల్సిన అవసరం ఉంది. తనిఖీలు కేవలం కార్యాలయ రికార్డులకే పరిమితమవుతున్నాయా? లేక నిజంగానే వ్యాపార ప్రాంగణాలకు వెళ్లి పరిశీలిస్తున్నారా? అన్నది తేలాల్సి ఉంది.

పెట్రోల్ బంకులు.. గ్యాస్ కొలతలపై నిఘా ఏదీ

తూనికలు, కొలతల శాఖ పరిధి కేవలం కూరగాయల మార్కెట్లకే పరిమితం కాదు. పెట్రోల్ బంకుల్లో ఇంధన కొలతలు, ప్యాకేజ్డ్ వస్తువులపై ప్రకటించిన నికర బరువు, వివిధ వాణిజ్య సంస్థల్లో వినియోగించే కొలత పరికరాలపైనా పర్యవేక్షణ అవసరం. వినియోగదారుడు చెల్లించిన మొత్తానికి తగిన పరిమాణంలో సరుకు అందుతున్నదా లేదా అన్నది నిర్ధారించడం అధికారుల బాధ్యత. ఈ విభాగాల్లో తనిఖీల వివరాలను కూడా ప్రజలకు వెల్లడించాల్సిన అవసరం ఉంది.

సిబ్బంది కొరతా? విధుల నిర్వహణలో నిర్లక్ష్యమా..

జిల్లాల పరిధిలో తనిఖీలు ఆశించిన స్థాయిలో జరగకపోవడానికి సిబ్బంది కొరత కారణమా? అధికారుల పర్యవేక్షణ లోపమా? లేక క్షేత్రస్థాయిలో విధుల నిర్వహణలో నిర్లక్ష్యమా? అనే అంశాలపై ఉన్నతాధికారులు సమీక్షించాల్సిన అవసరం ఉంది. గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఎంతమంది అధికారులు పనిచేస్తున్నారు? ఎన్ని తనిఖీ బృందాలు ఉన్నాయి? నెలకు ఎన్ని తనిఖీలు నిర్వహిస్తున్నారు? నిబంధనలు ఉల్లంఘించిన వ్యాపారులపై ఎన్ని కేసులు నమోదు చేశారు? ఎంతమందికి జరిమానాలు విధించారు? అనే వివరాలను బహిర్గతం చేయాలి.

ఫిర్యాదు చేసినా ఫలితం లేదా..

తూనికల్లో మోసాలు ఎదురైనప్పుడు వినియోగదారులు ఎవరిని సంప్రదించాలి? ఎక్కడ ఫిర్యాదు చేయాలి? ఫిర్యాదు అందిన తర్వాత ఎంత సమయంలో అధికారులు స్పందిస్తారు? అనే విషయాలపై విస్తృత అవగాహన కల్పించాల్సి ఉంది. ప్రజలకు ఫిర్యాదు వ్యవస్థ అందుబాటులో ఉండటమే కాకుండా, వచ్చిన ఫిర్యాదులపై చర్యలు తీసుకున్న వివరాలను కూడా వెల్లడించాలి. వినియోగదారుల హక్కులను కాపాడాల్సిన విభాగమే నిర్లక్ష్యం వహిస్తే సామాన్యులకు న్యాయం ఎక్కడ దక్కుతుంది?

ఉన్నతాధికారులు స్పందించాల్సిందే...

ఇప్పటికైనా రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు గుంటూరు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో తూనికలు, కొలతల శాఖ పనితీరుపై ప్రత్యేక సమీక్ష నిర్వహించాలి. ఆకస్మిక తనిఖీలకు ఆదేశాలు జారీ చేయాలి. తనిఖీల గణాంకాలు, నమోదైన కేసులు, విధించిన జరిమానాలు, పెండింగ్ ఫిర్యాదుల వివరాలను ప్రజల ముందుంచాలి. అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలి.

ప్రజలు కష్టపడి సంపాదించిన డబ్బుతో కొనుగోలు చేసే ప్రతి వస్తువుకూ సరైన తూకం, కొలత లభించడం వారి హక్కు. ఆ హక్కును కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వానిది, సంబంధిత అధికారులది. వ్యాపారుల ఇష్టారాజ్యానికి అడ్డుకట్ట వేయకపోతే వినియోగదారుల రక్షణ వ్యవస్థపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుంది?

పించన్ల పంపిణీలో సరికొత్త మైలురాయి

వైసీపీకి గళ్ళా మాధవి బహిరంగ సవాల్

ఇప్పుడు ఇస్తున్న పించన్లను యథాతథంగా

కొనసాగిస్తూ ఒక్క నెలైనా పాలించగలరా



మంగళగిరి (ప్రశ్న న్యూస్) పేదల సంక్షేమం విషయంలో కూటమి ప్రభుత్వం వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని, అర్హతే ప్రామాణికంగా ఎన్టీఆర్ భరోసా పించన్లు అందిస్తున్నామని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి స్పష్టం చేశారు. 2029లో మళ్లీ అధికారంలోకి వస్తామని చెబుతున్న వైసీపీ నాయకులు.. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అందిస్తున్న పించన్లను యథాతథంగా కొనసాగిస్తూ కనీసం ఒక్క నెలైనా పరిపాలించగలరా? అని సవాల్ విసిరారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్‌లో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె వైసీపీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

పించన్లలో విప్లవాత్మక మార్పు..

గత పాలకులు పించన్లను రాజకీయ ప్రయోజనాలకు, ఓట్ల కోసం ఉపయోగించుకున్నారని మాధవి విమర్శించారు. ఐదేళ్లలో ఏడాదికి రూ.250 చొప్పున పెంచుతూ గొప్ప సంక్షేమం చేసినట్లు ప్రచారం చేసుకున్నారని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే వృద్ధాప్య పింఛన్‌ను ఒకేసారి రూ.4 వేలకు పెంచి ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందని తెలిపారు. దివ్యాంగులకు రూ.6 వేలు, పూర్తిగా మంచానికే పరిమితమైన వారికి నెలకు రూ.15 వేలు అందించడం ద్వారా బాధిత కుటుంబాలకు పెద్ద అండగా నిలుస్తోందన్నారు. కిడ్నీ వ్యాధులు, తలసేమియా, పక్షవాతం వంటి తీవ్ర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి కూడా ప్రత్యేక పింఛన్లు అందిస్తున్నట్లు వివరించారు.

ఐదేళ్లలో రూ.1.70 లక్షల కోట్ల భారం..

రానున్న ఐదేళ్లలో పించన్ల పంపిణీ కోసం రాష్ట్ర ప్రభుత్వంపై సుమారు రూ.1.70 లక్షల కోట్ల ఆర్థిక భారం పడుతున్నప్పటికీ పేదల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని మాధవి పేర్కొన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీనే లబ్ధిదారుల ఇంటి వద్దకు వెళ్లి పింఛన్లు అందించడం ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనమన్నారు. సెలవు రోజులు వస్తే ముందుగానే పంపిణీ పూర్తి చేస్తున్నామని చెప్పారు. పింఛన్ అనేది కేవలం ఆర్థిక సాయం కాదని, పేదల ఆత్మగౌరవానికి, ఆ కుటుంబాల భరోసాకు ప్రతీక అని అభివర్ణించారు.రాష్ట్రంలో జరుగుతున్న పంచాయతీ, మున్సిపల్ ఎన్నికల్లో గ్రామాలు, పట్టణాల సమగ్రాభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని కూటమి అభ్యర్థులను గెలిపించాలని ప్రజలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి విజ్ఞప్తి చేశారు.

అరసవల్లి అభివృద్ధిపై అచ్చెన్న అస్త్రం

దశాబ్దాల పాలనలో నగరానికి చేసిందేమిటి

ఆలయానికే అభివృద్ధి చేయలేకపోయారు.. నగరాన్ని ఏం మారుస్తారు



శ్రీకాకుళం (ప్రశ్న న్యూస్) దశాబ్దాల పాటు అధికారం అనుభవించిన నాయకులు శ్రీకాకుళం నగరానికి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రశ్నించారు. అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్నే అభివృద్ధి చేయలేని వారు నగరాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు. ఎన్నికల వేళ మాయమాటలు, ప్రలోభాలతో ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నాలను నమ్మవద్దని సూచించారు. నగరపాలక సంస్థ ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం నిర్వహించిన భారీ ర్యాలీలో ఆయన ప్రత్యర్థులపై రాజకీయ విమర్శలు గుప్పించారు.

పాలనకు అభివృద్ధే గీటురాయి

25 ఏళ్ల పాలనలో అరసవల్లి ఆలయాన్ని ఆశించిన స్థాయిలో అభివృద్ధి చేయలేకపోయారని అచ్చెన్నాయుడు ఆరోపించారు. 40 ఏళ్ల రాజకీయ ప్రస్థానంలో శ్రీకాకుళం నగరానికి ఏమి చేశారో ప్రజలకు వివరించాలని సవాల్ విసిరారు. సుమారు 16 ఏళ్లుగా స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగకపోవడంతో ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని పేర్కొన్నారు. గత పాలనలో జరిగిన అభివృద్ధిని, ప్రస్తుత పరిస్థితులను బేరీజు వేసుకుని నిర్ణయం తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

నగరానికి కొత్త రూపు.. రెండున్నరేళ్లలో మార్పు..

2024 ఎన్నికల అనంతరం శ్రీకాకుళం అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నామని మంత్రి తెలిపారు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఎమ్మెల్యే గొండు శంకర్‌తో సమన్వయం చేసుకుంటూ నగరానికి అవసరమైన అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. రానున్న రెండున్నరేళ్లలో నగర రూపురేఖలు మార్చడమే లక్ష్యమన్నారు. ఈ సందర్భంగా నగర ప్రజలకు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి, తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ అభివృద్ధికి కృషి చేస్తామని పేర్కొన్నారు.

హద్దులు దాటితే,లైసెన్స్ రద్దు-ఉన్నతధికారులు

- మార్కెటింగ్ డిపార్ట్మెంట్ కేటాయించిన షాపు ముందే వ్యాపార లావాదేవీలు నిర్వహించాలి లేని పక్షంలో మంజూరు అయిన లైసెన్స్ లు మాయం
- బోయిన్ పల్లి మార్కెట్ లో కమీషన్ ఏజెంట్లకు"మాల్" (పంట) ఎక్కువగా వచ్చినప్పటికీ షాపు ముందే అమ్మాల్సిందే
- గ్రేన్ మర్చెంట్స్ దుకాణాల్లో కూరగాయల క్రయ విక్రయాలు.ఆపే నాధుడే లేడ? మేమున్నామంటున్న"స్పెషల్ డ్రైవ్"అధికారులు
- లక్షల్లో కిరాయిలు సొంతం చేసుకుంటున్నారు.గ్రేన్ మర్చెంట్స్ లో కౌన్ బనేగ కరోడ్ పతి.వీరి పై లేవా చర్యలు
- మూసపేట్ లైన్లో గ్రేన్ దుకాణ యాజమాన్యం రెంట్ ఏటా "50"లక్షల రూపాయలు వరకు వసూళ్లు చేస్తున్నట్టు సమాచారం
- కిరాయికి ఇస్తున్న గ్రేన్ పై గరం కావాల్సిన సమయం ఆసన్నమైందని మార్కెట్ వర్గాలు గుసగుసలాడుకుంటున్నారు



కంటోన్మెంట్(ప్రశ్న న్యూస్) డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో ప్రతి రోజూ వింతలే వింతలు.మార్కెటింగ్ డిపార్ట్మెంట్ వ్యవస్థ ఉన్నప్పటికి వర్తకుల్లో భయం లేకుండా బరితెగించి వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తున్నారంటే వీరి ధైర్యం ఏమిటి.మార్కెట్లో అధికారులు ఏం చేస్తున్నారో కళ్లకి కన్పిస్తున్న సంఘటనలే ఉదాహరణలు. అడ్డుగోలు వ్యాపారానికి చెక్ పెట్టాల్సిన అధికారులు జాడేది. గ్రౌండ్లో విధులు నిర్వహించే సూపర్వైజర్లు నిర్లక్ష్యమే అన్నింటికీ కారణమా!లేక
వారి పై బాధ్యతలు వదిలేసి
హాయ్ గా ఎంజాయ్ చేస్తున్న అధికారులదా.
ఎదేమైతేనేమీ జరగాల్సిన
నష్టం అస్మాదీయులతో జరుగుతున్న విషయం అందరికి తెలిసిందే.

బోయిన్ పల్లి కూరగాయల మార్కెట్‌లో నిబంధనల ఉల్లంఘన..

కేటాయించిన దుకాణం కాకుండా మరొక చోట వ్యాపారం చేస్తే ఏం జరుగుతుంది? డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కూరగాయల మార్కెట్ పరిధిలో వ్యాపారం చేసే ప్రతి వ్యాపారికి తెలంగాణ (వ్యవసాయ ఉత్పత్తులు) మార్కెట్ల చట్టం--1966, నిబంధనలు--1969 ప్రకారం ప్రత్యేక స్థలం లేదా దుకాణం కేటాయింపుతో కూడిన లైసెన్స్ జారీ చేయబడుతుంది.ఒక లైసెన్స్ యజమాని తనకు కేటాయించిన దుకాణంలో కాకుండా మార్కెట్‌లోని మరొక దుకాణం వద్ద లేదా ఇతర ప్రాంతంలో వ్యాపారం నిర్వహించడం చట్టరీత్యా నేరం.అలాగే తీవ్రమైన నిబంధనల ఉల్లంఘనగా పరిగణించబడుతుంది. చట్టంలోని సెక్షన్ 7(1) ప్రకారం,మార్కెట్ కమిటీ జారీ చేసిన లైసెన్స్ షరతులకు లోబడి, అందులో పేర్కొన్న నిర్దిష్ట ప్రదేశంలో మాత్రమే క్రయవిక్రయాలు జరపాల్సి ఉంటుంది.ఒకవేళ వ్యాపారి తన దుకాణాన్ని వదిలి వేరే దుకాణం వద్ద వ్యాపారం చేసినా,తన లైసెన్స్‌ను ఇతరులకు సబ్-లీజుకు ఇచ్చినా,లేదా మరొకరి స్థలాన్ని ఆక్రమించి వ్యాపారం సాగించినా మార్కెట్ కమిటీ అధికారులు తక్షణమే రంగంలోకి దిగి తగు చర్యలు తీసుకుంటారు. ముందుగా మార్కెట్ సెక్రటరీ లేదా తనిఖీ అధికారులు క్షేత్రస్థాయి విచారణ జరిపి, ఆక్రమణలు లేదా అనధికారిక వ్యాపారానికి సంబంధించిన నివేదికను సిద్ధం చేస్తారు.అనంతరం సదరు లైసెన్స్ యజమానికి నిబంధనల ఉల్లంఘన పై వివరణ కోరుతూ అధికారికంగా 'షోకాజ్ నోటీసు' (కారణం చూపు నోటీసు) జారీ చేస్తారు.
నిర్ణీత గడువులోగా వ్యాపారి ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకపోయినా,లేదా ఉద్దేశపూర్వకంగా నిబంధనలను అతిక్రమించినట్లు రుజువైనా మార్కెట్ కమిటీ కఠిన చర్యలు



తీసుకునేదానికి వెనుకాడదు.తెలంగాణ మార్కెట్ల నిబంధనలు, 1969లోని రూల్ 52 ప్రకారం,మార్కెట్ కమిటీ సమావేశంలో తీర్మానం చేసి సదరు వ్యాపారి లైసెన్స్‌ను తాత్కాలికంగా సస్పెండ్ చేయడం లేదా శాశ్వతంగా రద్దు (క్యాన్సిల్) చేసే అధికారం ఉంటుంది. ఒకసారి లైసెన్స్ రద్దయితే, చట్టంలోని సెక్షన్ 7(4) ప్రకారం కనీసం ఒక సంవత్సరం పాటు తిరిగి కొత్త లైసెన్స్ పొందే అర్హతను ఆ వ్యాపారి కోల్పోతాడు.అంతేకాకుండా, మార్కెట్ ప్రాంగణంలో అధికారుల ఆదేశాలను ధిక్కరిస్తూ వేరే చోట సరుకులు నిల్వ చేసినా లేదా విక్రయించినా ఆ సరుకును సీజ్ చేయడంతో పాటు జరిమానాలు విధిస్తారు.సెక్షన్ 23 ప్రకారం,లైసెన్స్ నిబంధనలను ఉల్లంఘించిన వారికి కోర్టు ద్వారా జరిమానా విధించడంతో పాటు, మరికొన్ని తీవ్రమైన ఉల్లంఘనల విషయంలో జైలు శిక్ష పడే అవకాశం కూడా ఉంది.అలాగే,వేరే దుకాణం వద్ద వ్యాపారం చేస్తూ టర్నోవర్ వివరాలను దాచిపెట్టి మార్కెట్ ఫీజు ఎగవేసినట్లు తేలితే, సెక్షన్ 12-బి కింద అసలు ఫీజుతో పాటు దానికి రెట్టింపు మొత్తాన్ని జరిమానాగా వసూలు చేస్తారు.సదరు వ్యాపారి మార్కెట్‌కు చెల్లించాల్సిన బకాయిలు లేదా జరిమానాలను చెల్లించకపోతే,భూమి శిస్తు బకాయిల చట్టం కింద వారి ఆస్తుల నుంచి రికవరీ చేసే అధికారం కూడా ప్రభుత్వానికి ఉంటుంది. దీనివల్ల తోటి వ్యాపారులకు ఇబ్బంది కలగకుండా ఉండటమే కాకుండా, మార్కెట్‌లో పారదర్శకత, క్రమశిక్షణ,రైతులకు న్యాయమైన ధర లభించేలా మార్కెట్ కమిటీ



పర్యవేక్షిస్తుంది.కాబట్టి బోయిన్ పల్లి మార్కెట్‌లోని లైసెన్స్‌దారులు తమకు కేటాయించిన దుకాణంలోనే నిబంధనల ప్రకారం వ్యాపారం నిర్వహించడం శ్రేయస్కరమని చట్టం చెబుతోంది.

బోయిన్ పల్లి మార్కెట్ లో "స్పెషల్ డ్రైవ్ "లో వాస్తవాలు..

డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ కూరగాయల మార్కెట్ లో గత వారం రోజుల క్రితం అడిషనల్ డైరెక్టర్ రవి కుమార్ ఆదేశాల మేరకు జూన్ వెస్లీ అధికారి తనిఖీలో భాగంగా దేవేందర్ బి:50 వర్తకుడు తనకు కేటాయించిన షాపు వద్ద వ్యాపార లావాదేవీలు నిర్వహించ కుండా మరోచోట అయిన గ్రేన్ మర్చెంట్స్ షాపు"బి:4"వద్ద కూరగాయల బిజినెస్ చేస్తున్న విషయం గమనించారు.అలాగే మరో కమీషన్ ఏజెంట్ సైతం (శ్రీనివాస్ బి:42) తనకు కేటాయించిన స్థలంలో కాకుండా గ్రేన్ మర్చెంట్స్ దుకాణాల్లో కూరగాయల వ్యాపారం చేస్తున్నారు.
అయితే ఈ రెండు విషయాల పై మార్కెట్ ఉన్నత శ్రేణి అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.?

అసలు విషయం గోప్యం, బయట పెట్టిన జూన్ వెస్లీ..

స్పెషల్ డ్రైవ్ లో భాగంగా
తనిఖీలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కళ్లు బైర్లు కమ్మే
నిజాలు వెలుగులోకి వచ్చాయి.మార్కెటింగ్ డిపార్ట్మెంట్ జారీ చేసిన లైసెన్స్ లు బయట వ్యక్తులు కొనుగోలు చేసినట్లు గుర్తించిన జూన్ వెస్లీ.అయితే అసలు విషయం ఏమిటంటే (గోలి అండ్ బ్రదర్స్,గోలి దేవేందర్ కి చెందిన బి:50 షాపు).
బి:42 మరో సదరు కమీషన్ ఏజెంట్ ది,ఇది
కాకుండా బి:4 గ్రేన్ మర్చెంట్స్ షాపు మరోకరిది.
ఇలా ఒకే వ్యక్తి మూడు దుకాణాలు కొనుగోలు చేసిన విషయం స్పెషల్ డ్రైవ్ అధికారిని ఆశ్చర్య పరిచింది.అదిగాక ఆ అస్మాదీయుడు నాకున్న రెండు షాపులో సరుకు ఎక్కువ రావడం వల్ల బి:4 వద్ద వ్యాపారం చేస్తున్నానని వివరణ ఇచ్చారు.అలాగే ఈ మూడు దుకాణాలు నావే అనడంతో అధికారి షాక్ కి గురైయ్యారు.ఇంత పెద్ద మోసాన్ని అడిషనల్ డైరెక్టర్ రవి కుమార్ కి నివేదిక రూపంలో అందజేయనున్నట్లు విశ్వసనీయ సమాచారం.?

మహిళలపై హింసకు చరమగీతం ఎప్పుడు

- చట్టాలున్నా తగ్గని వేధింపులు.. మారని సమాజ తీరు
- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ



గుంటూరు (ప్రశ్న న్యూస్) మహిళల రక్షణ కోసం చట్టాలు ఎన్నున్నా.. వేధింపులు మాత్రం ఎందుకు ఆగడం లేదు? మహిళలు విద్య, ఉద్యోగం, రాజకీయాలు, పారిశ్రామిక రంగాల్లో ఉన్నత స్థానాలను అధిరోహిస్తున్నా.. ఇంటి నుంచి బయట అడుగుపెట్టే ప్రతి సందర్భంలో భద్రతపై ఆందోళన ఎందుకు? మహిళల సాధికారత గురించి గొప్పగా మాట్లాడుతున్న సమాజం.. వారికి గౌరవప్రదమైన జీవనాన్ని కల్పించడంలో ఎందుకు విఫలమవుతోంది? ఈ ప్రశ్నలకు సమాజం సమాధానం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ స్పష్టం చేశారు.
మహిళలకు భద్రత లేని సమాజంలో అభివృద్ధికి అర్థమే లేదని, మహిళలపై హింసను అరికట్టేందుకు చట్టాలతో పాటు సామాజిక ఆలోచనా విధానంలోనూ మార్పు రావాలని పిలుపునిచ్చారు. బాల్యం నుంచే మగపిల్లలకు స్త్రీలను గౌరవించడం, సమానత్వ భావనను నేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.నవంబర్ 25న నిర్వహించే అంతర్జాతీయ మహిళలపై హింస నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్, ధర్మపీఠం సంయుక్త ఆధ్వర్యంలో విద్యార్థులకు మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ శైలజ మాట్లాడుతూ, మహిళలపై హింసను కేవలం చట్టాలు, పోలీసు చర్యలతోనే పూర్తిగా నిర్మూలించలేమని, కుటుంబం నుంచే గౌరవం, బాధ్యత, సమానత్వ విలువలు ప్రారంభం కావాలని పేర్కొన్నారు.

సోషల్ మీడియా ముసుగులో వేధింపులా..

నేటి డిజిటల్ యుగంలో మహిళలపై వేధింపులు కొత్త రూపాలు సంతరించుకుంటున్నాయని శైలజ ఆందోళన వ్యక్తం చేశారు. శారీరక దాడులే కాకుండా ఆన్‌లైన్ వేధింపులు, అసభ్య వ్యాఖ్యలు, సామాజిక మాధ్యమాల్లో కించపరిచే పోస్టులు కూడా మానసిక హింసేనని స్పష్టం చేశారు. వాక్ స్వాతంత్ర్యం పేరుతో మహిళల గౌరవానికి భంగం కలిగించే చర్యలను సహించేది లేదన్నారు. మహిళల రక్షణకు చట్టాలు ఉన్నా వాటిపై అవగాహన లేకపోవడం వల్ల బాధితులు వాటిని పూర్తిస్థాయిలో వినియోగించుకోలేకపోతున్నారని తెలిపారు. ప్రతి మహిళ తన హక్కులు, చట్టపరమైన రక్షణలపై అవగాహన పెంచుకోవాలని పిలుపునిచ్చారు.

ఆర్థిక స్వాతంత్ర్యమే ఆత్మవిశ్వాసానికి పునాది..

సభాధ్యక్షత వహించిన యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్, కామర్స్ అండ్ లా ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ త్రిమూర్తులు మాట్లాడుతూ, విద్యాసంస్థల్లో మహిళా చైతన్య కార్యక్రమాలను సామాన్య మహిళల వరకు విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. రెక్టార్ ఆర్. శివరామ ప్రసాద్ మాట్లాడుతూ, మహిళలు ప్రతికూల పరిస్థితులకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో లక్ష్యాల వైపు సాగాలని ఆకాంక్షించారు.సైకాలజీ విభాగం ప్రొఫెసర్ విమల మాట్లాడుతూ, చట్టపరమైన రక్షణలు అందుబాటులో ఉన్నప్పటికీ వాటిని పొందలేని పరిస్థితుల్లో మహిళలు ఉన్నారని పేర్కొన్నారు. మహిళలు మానసికంగా బలోపేతమైతే ఎలాంటి సవాలునైనా ఎదుర్కోగలరన్నారు. సెంటర్ ఫర్ ఉమెన్ స్టడీస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఈ. భవాని మాట్లాడుతూ, విద్య మహిళా సాధికారతకు శక్తివంతమైన సాధనమని, ఆర్థిక స్వాతంత్ర్యం మహిళల్లో అన్యాయాలను ఎదిరించే ధైర్యాన్ని పెంపొందిస్తుందని వివరించారు. ధర్మపీఠం జాతీయ న్యాయ సలహాదారు గంటా సతీష్ కుమార్ మహిళలపై ఆన్‌లైన్ వేధింపులను ఎదుర్కొనే చట్టపరమైన మార్గాలను వివరించారు. మహిళల హక్కులు, రక్షణ అంశాలపై తాను రూపొందించిన పరిశోధన పత్రాలను విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. వ్యాసరచన పోటీల్లో విజేతలకు ధర్మపీఠం అధ్యక్షుడు శెట్టిపల్లి శశికిరణ్ నగదు బహుమతులు, ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎం. సురేష్ కుమార్, మహిళా ప్రొఫెసర్లు, ధర్మపీఠం కార్యవర్గ సభ్యులు సంపతి సంతోష్ కుమార్, తాళ్లూరి ప్రహర్షిత, యర్రంశెట్టి శ్రీనివాస్, విద్యార్థినులు హర్షిత, నేహా తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో కూటమి రోడ్‌షో హోరు

అండగా నిలవండి.. అభివృద్ధి బాధ్యత నాది

మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ భరోసా



అల్లూరు (ప్రశ్న న్యూస్)అల్లూరు నగర పంచాయతీ ఎన్నికల ప్రచార ముగింపు సందర్భంగా కూటమి నేతలు భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి టీడీపీ, జనసేన కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. చైర్మన్ అభ్యర్థి తోటకూర సునీల్ కుమార్‌తో పాటు కౌన్సిలర్ అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి భారీ మెజారిటీతో గెలిపించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ అల్లూరు ప్రజలు కూటమికి అండగా నిలిస్తే నగర పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించి చూపిస్తానని హామీ ఇచ్చారు. అల్లూరును అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని స్పష్టం చేశారు. ప్రజల ఆశీస్సులతో స్థానిక సమస్యలకు పరిష్కారం చూపుతూ మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తామని తెలిపారు.

పంచాయతీ ఎన్నికల్లో ఒంటరిగా జనసేన పోటీ

విజయవాడ : ఆంధ్రప్రదేశ్ స్థానిక సంస్థల ఎన్నికల పోరులో భాగంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో విడిగా పోటీ చేసేందుకు జనసేన పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. మున్సిపల్, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల తరహాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటు , స్థానాల పంపకాలు ఉండవని, పార్టీ నాయకులు, జనసైనికులు, వీర మహిళలు ఎవరైనా ఎలాంటి రాజకీయ అడ్డంకులు లేకుండా స్వేచ్ఛగా నామినేషన్లు దాఖలు చేయవచ్చని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆదివారం అధికారికంగా ప్రకటించారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు రాజకీయ పార్టీలకు అతీతంగా, స్థానిక సంస్థలను బలోపేతం చేసే లక్ష్యంతో జరిగేవని జనసేన నాయకత్వం పైకి చెబుతున్నప్పటికీ, దీని వెనుక క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలు, క్యాడర్ ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తున్నాయి.నిజానికి, ఇటీవల జరిగిన మున్సిపాలిటీలు, పరిషత్ ఎన్నికల వరకు టీడీపీ?జనసేన?బీజేపీ కూటమి పొత్తు విజయవంతంగానే పనిచేసి, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకుంది. అయితే, గ్రామస్థాయికి వచ్చేసరికి కూటమి పార్టీల మధ్య సర్దుబాటు సాధ్యం కాదని తేలిపోయింది. మున్సిపల్, పరిషత్ ఎన్నికల సమయంలోనే కొన్ని స్థానాల్లో తమకు అన్యాయం జరిగిందని, టీడీపీ గ్రామ , మండల స్థాయి నేతలు తమ డిమాండ్లను పట్టించుకోవడం లేదని జనసేన కార్యకర్తలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.గ్రామాల్లో బలంగా ఉన్న జనసైనికులకు సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అవకాశాలు దక్కకపోతే పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందని గుర్తించిన పవన్ కళ్యాణ్, కార్యకర్తల మనోభావాలను గౌరవిస్తూ వారికి ఫ్రీ హ్యాండ్ ఇచ్చారనే విశ్లేషణలు వినిపిస్తున్నాయి.మరోవైపు, కూటమిలోని మూడో భాగస్వామి అయిన బీజేపీలోనూ స్థానిక ఎన్నికల ఫలితాలు, పదవుల పంపకాల విషయంలో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో అనంతపురం కార్పొరేషన్‌తో పాటు కొన్ని మున్సిపల్ స్థానాల్లో కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపం వల్లే తమ అభ్యర్థులు ఓడిపోయారని, జడ్పీ చైర్మన్లు , కీలక పదవుల విషయంలో తమకు తగిన ప్రాధాన్యత దక్కడం లేదని బీజేపీ శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. భీమవరం వంటి చోట్ల కూటమి ధర్మాన్ని ఉల్లంఘించారంటూ బీజేపీ నేతలు బహిరంగంగానే అసమ్మతి గళం వినిపించిన పరిస్థితి కనిపించింది. ఆది నారాయణ రెడ్డి రాజీనామా ప్రకటన ఈ అసంతృప్తిని మరింత పెంచింది.ఇటీవల జరిగిన ఉమ్మడి మీడియా సమావేశంలో సైతం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన మంత్రి నాదెండ్ల మనోహర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ స్థానిక ఎన్నికల్లో కొన్ని చోట్ల కూటమి పార్టీల మధ్య స్వల్ప సమన్వయ లోపాలు తలెత్తాయని అంగీకరించారు. పైస్థాయిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, బీజేపీ అగ్రనేతల మధ్య అద్భుతమైన అవగాహన ఉన్నప్పటికీ, కిందిస్థాయి కార్యకర్తలు , గ్రామ నాయకుల మధ్య ఆ స్థాయి సమన్వయం ఇంకా పూర్తిస్థాయిలో రాలేదని తాజా పరిణామాలు స్పష్టం చేస్తున్నాయి. రెండు విడతల పంచాయతీ ఎన్నికల నామినేషన్ల గడువు ముగిసిన తర్వాత జనసేన నుంచి ఈ ప్రకటన రావడంపై సోషల్ మీడియాలో భిన్న స్పందనలు వ్యక్తమవుతున్నప్పటికీ, రాబోయే విడతల్లో గ్రామాల్లో పోటీ మరింత ఆసక్తికరంగా మారనుంది. పార్టీ గుర్తులు లేని ఎన్నికలు కావడంతో కూటమి పార్టీల మద్దతుదారులు స్నేహపూర్వక పోటీ పేరుతో బరిలోకి దిగితే, ఆ ఓట్ల చీలిక కొన్ని చోట్ల అయినా సమస్యలు సృష్టించే అవకాశం ఉంది.

అత్యాధునిక కవచ్ పనులు...

కాకినాడ ఏపీ రైల్వే మౌలిక సదుపాయాల కల్పనలో దక్షిణ కోస్తా రైల్వే మరో ముందడుగు వేసింది. రూ.4,299 కోట్లకు పైగా భారీ ఖర్చుతో బిక్కవోలు–దువ్వాడ మధ్య మూడో, నాలుగో బ్రాడ్‌గేజ్ రైల్వే లైన్ల నిర్మాణానికి ఇంజనీరింగ్, ప్రొక్యూర్‌మెంట్ అండ్ కన్‌స్ట్రక్షన్ విధానంలో టెండర్లను ఆహ్వానించింది. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా మొత్తం 151.08 కిలోమీటర్ల పొడవున కొత్త రైల్వే ట్రాక్‌లను నిర్మించనున్నారు.చెన్నై?కోల్‌కతా ప్రధాన రైల్వే మార్గంలో ఉన్న ఈ సెక్షన్‌పై ఇటీవల ప్రయాణికుల రైళ్లతో పాటు సరకు రవాణా రైళ్ల రద్దీ విపరీతంగా పెరిగింది. ప్రస్తుతం ఉన్న రెండు లైన్లు ఈ ఒత్తిడిని తట్టుకోలేకపోతుండటంతో అదనంగా మరో రెండు ట్రాక్‌లను నిర్మించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. బిక్కవోలు నుంచి ప్రారంభమై సామర్లకోట మీదుగా దువ్వాడ వరకు సాగే ఈ మార్గంలో.. రద్దీని నివారించేందుకు ప్రస్తుత తుని, అనకాపల్లి రైల్వే స్టేషన్లను బైపాస్ చేస్తూ అలైన్‌మెంట్ రూపొందించడం జరిగింది. అదే విధంగా ఈ కొత్త ట్రాక్‌లను అనకాపల్లి–కొత్తవలస కొత్త బ్రాడ్‌గేజ్ లైన్‌కు అనుసంధానం చేయనున్నారు.ఈ భారీ ప్రాజెక్ట్ కింద కేవలం పట్టాలు వేయడమే కాకుండా సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నలింగ్, టెలికమ్యూనికేషన్, పూర్తిస్థాయి విద్యుదీకరణతో పాటు అత్యాధునిక రైలు రక్షణ వ్యవస్థ ‘కవచ్’ పనులను కూడా చేపట్టనున్నారు. టెండర్ ప్రక్రియలో భాగంగా డిసెంబర్ 23న ప్రీ–బిడ్ సమావేశం నిర్వహించనుండగా.. 2027 ఫిబ్రవరి 15 వరకు బిడ్లను దాఖలు చేసేందుకు గడువు ఇచ్చారు. గరిష్ఠంగా నాలుగు సంస్థలతో కూడిన కన్సార్టియం కూడా ఏకమొత్తంగా ఈ టెండర్లలో పాల్గొనే వెసులుబాటు కల్పించారు.పనులు ప్రారంభమైన నాటి నుంచి 45 నెలల్లోగా ఈ ప్రాజెక్టును పూర్తి చేయాలని టార్గెట్ నిర్దేశించారు. దక్షిణ కోస్తా రైల్వే పరిధిలోని విజయవాడ, విశాఖపట్నం డివిజన్ల మధ్య రైళ్ల వేగం పెరగడానికి.. ముఖ్యంగా విజయవాడ–విశాఖ మెయిన్ లైన్‌పై ట్రాఫిక్ రద్దీ తగ్గడానికి ఈ ప్రాజెక్టు ఎంతగానో దోహదపడనుంది.


పథకాలపై నిఘా ప్రచారం

తిరుపతి: ఏపీపై కేంద్ర ప్రభుత్వం నిఘా పెట్టిందని.. నివేదికలు కోరిందని.. కూటమి సర్కారులో తమకు అన్యాయం జరు గుతోందని బీజేపీ భావిస్తోందని అందుకే ఇలా సమాచారం తెప్పించుకునే ప్రయత్నంలో ఉందని జగన్ మీడియా సహా వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున ప్రచారం చేస్తున్నారు. వైసీపీ అనుకూల మీడియాలో కూడా పెద్ద ఎత్తున ఈ కథనాలు వస్తున్నాయి. మరి దీనిలో నిజం ఉందా? లేక.. బీజేపీ నాయకులను రెచ్చగొట్టే కార్యక్రమం ఏదైనా చేపట్టారా? అనేది చర్చకు దారితీస్తోంది.కేంద్ర ప్రభుత్వం నివేదికలు తెప్పించుకునే స్థాయిలో కూటమి ప్రభుత్వం లేదు. పైగా.. కేంద్రం లోని బీజేపీ పెద్దలకు ఉన్న ప్రధాన అలవాటు.. విపక్షాలు.. లేదా.. తమకు ఎదురుతిరిగే నాయకులు ఉన్న రాష్ట్రాల్లో ని ప్రబుత్వాల పైనే కన్నేస్తాయి. ప్రస్తుతం ఇలాంటి వాతావరణం.. మనకు తెలంగాణలో కనిపిస్తోంది. ప్రధాని నరేంద్ర మోడీని నేరుగా టార్గెట్ చేస్తున్న సీఎం రేవంత్‌తో పాటు.. తమకు అత్యంత ప్రత్యర్థి పక్షమైన కాంగ్రెస్ పార్టీ ఇక్కడ అధికారంలో ఉంది. దీనికితోడు.. తాము ఒకింత కష్టపడితే.. అధికారం దక్కించుకోవచ్చన ఆశ కూడా బీజేపీకి కనిపిస్తోంది. దీంతో తెలంగాణపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. నివేదికలు కూడా తెప్పించుకుంటోంది స్వయంగా కూటమిలో బీజేపీ భాగస్వామ్య పార్టీ. అంతే కాదు.. టీడీపీ, జనసేనల అండ తోనే కేంద్రంలో ప్రబుత్వాన్ని ఏర్పాటు చేసింది. ఇక, ఏపీలోనూ తమ పార్టీ నాయకులు మంత్రులు గాఉన్నారు. ఇక్కడ జరుగుతున్న అభివృద్ధిలో బీజేపీ పాత్ర కూడా ఉందని చంద్రబాబు స్వయంగా చెబుతున్నారు. ఇక, పవన్ సంగతి ప్రత్యేకంగా చెప్పే పనేలేదు. ఆయన ఎక్కడ ఏమైకు దొరికినా.. ప్రధాని మోడీపై ప్రశంసలు కురిపిస్తూనే ఉన్నారు. సో.. బీజేపీకి అనుమానం వచ్చేటంత రాజకీయాలు కానీ.. ఆ పార్టీ గ్రాఫ్ ను తగ్గించే రాజకీయ వ్యూహాలు కానీ లేవు. కాబట్టి నివేదికలు కోరే పరిస్థితి లేదని అంటున్నారు పరిశీలకులు. వైసీపీ గురించే నివేదికలు తెప్పించుకునే పరిస్థితి ఉందని విశ్లేషకులు అంటున్నారు. 2024 తర్వాత.. వైసీపీ ఏమేరకు పుంజుకుంది? వచ్చే ఎన్నికల నాటికి ఆ పార్టీ పరిస్థితి ఏంటి? అనే విషయాలపై బీజేపీ దృష్టి పెట్టే అవకాశం ఉందే తప్ప.. తాము కూర్చున్న కొమ్మను నరుక్కోవాలనే సాహసానికి ఆ పార్టీ ఎప్పుడూ ప్రయత్నం చేయదని చెబుతున్నారు. కానీ వైసీపీ వ్యూహం ఏంటంటే.. బీజేపీ పెద్దలు కూటమి పాలనపై అసంతృప్తిగా ఉన్నారని, తమను తొక్కేస్తున్నారన్న భావనలో ఉన్నారని ప్రచారం చేయడం ద్వారా.. స్తానిక నాయకత్వంలో విభేదాలు తీసుకురావాలన్న రాజకీయ వ్యూహం దాగి ఉండి ఉంటుందని చెబుతున్నారు. అంతేతప్ప.. కేంద్రానికి కూటమిపై ఎలాంటి సంశయం లేదని చెబుతున్నారు.

బొరంపేటలో గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ చోరీ

- 86 సిలిండర్లు, మూడు ఆటోలు స్వాధీనం
- నిజాంపేట్‌కు చెందిన హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీపై పోలీసుల దర్యాప్తు


హైదరాబాద్ దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో బొరంపేటలో అక్రమంగా గ్యాస్ సిలిండర్ల నుంచి గ్యాస్ చోరీ చేస్తున్న ముఠా గుట్టును స్థానికులు రట్టు చేశారు. సతీష్ సొసైటీలోని ఓ రహస్య గోదాంలో డెలివరీ బాయ్స్ సిలిండర్ల నుంచి గ్యాస్ తీస్తుండగా గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న దుండిగల్ పోలీసులు 86 హెచ్‌పీ గ్యాస్ సిలిండర్లతో పాటు మూడు ఆటోలను స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక విచారణలో ఈ వ్యవహారం నిజాంపేట్‌కు చెందిన శ్రీ లలిత గాయత్రి హెచ్‌పీ గ్యాస్ ఏజెన్సీకి సంబంధించి ఉన్నట్లు గుర్తించారు. ఎస్ఐ రంజిత్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



జెండా మోస్తేనా ఇందిరమ్మ ఇళ్లు.?

- కార్యకర్తల కోసమోనా ప్రభుత్వ పథకాలు, అర్హులకు దినదిన ఎదురు చూపులేనా
- నిరుపేద విద్యావంతునీకేది గూడు అధికారులు పార్టీనేతల పక్షపాతుల అనారోగ్యంతో తల్లి
- వృద్ధాప్యంలో అమ్మమ్మ చదువుకుంటూ కుటుంబ పోషణ నిరుపేదలు ఓట్లప్పడే గుర్తుకొస్తారా
- అధికారుల నిర్లక్ష్యపు సర్వేలు స్థానిక నాయకుల కండ్లకు గంతలు
- ఏళ్ళ తరబడి ఎదురు చూపులే దిక్కు.ఎమ్మెల్యే కనకయ్య సార్ కనుకరించవా.?





గార్ల(ప్రశ్న న్యూస్) ఎన్నో ఏళ్ళు గడిచినా ఎన్ని ప్రభుత్వాలు మారిన పెదోడికి ప్రభుత్వ పథకాలు అమలులోకి రావాలంటే ఒకటి వాళ్ళ పార్టీ జెండా అయిన మోయాలి, లేదా అడుగులకు మడుగులైన ఒత్తలి తప్ప అర్హులకు నేరుగా పథకాలు అందవు అనడానికి నిలువెత్తు నిదర్శనం కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకమే. తెలంగాణ రాష్ట్రంలో లక్షల మందికి ఇందిరమ్మ ఇండ్లు కట్టిస్తామని గొప్పలు చెబుతున్న ప్రభుత్వ పెద్దలకు నిరుపేదల రోదనలు కనిపించకుండా అడ్డుపడుతున్నారు స్థానిక నాయకులు, అధికారులు. ఇందిరమ్మ ఇళ్లుకు అన్ని అర్హత ఉండి కూడా సంవత్సరాల తరబడి నాయకుల, అధికారుల అసమర్థత కారణంగా పేదోడి సొంతింటి కలలు కలలుగానే మిగిలిపోతున్నాయి. దీనికి నిలువెత్తు నిదర్శనం మహబూబాబాద్ జిల్లా గార్ల మండల కేంద్రమే సజీవ సాక్ష్యం. ఎన్నికల సమయంలో పేదలే గుర్తుకొస్తారు.. ఓట్లు అవసరమైనప్పుడు ప్రతి గడపా తొక్కుతారు.. కానీ ప్రభుత్వ పథకాల అమలు విషయానికి వచ్చేసరికి మాత్రం నిజమైన అర్హులు అధికారుల కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంటోందనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ జెండాలు మోస్తేనే పథకాలు అందుతాయా? స్థానిక నాయకుల చుట్టూ తిరిగితేనే ఇందిరమ్మ ఇల్లు మంజూరవుతుందా? ప్రభుత్వ పథకాలు పార్టీ కార్యకర్తలకే పరిమితమా? అనే ప్రశ్నలు గార్ల మండలంలో చర్చనీయాంశంగా మారుతున్నాయి. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో అర్హులైన నిరుపేదలకు ప్రాధాన్యత ఇవ్వాల్సి ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలు, ఎంపిక ప్రక్రియలో పక్షపాతం జరుగుతోందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ కొందరు నిరుపేదలకు ఇళ్లు మంజూరు కాకపోవడం ఆందోళన కలిగిస్తోంది.గార్ల మండల కేంద్రంలో ఓ నిరుపేద విద్యావంతుడి కుటుంబ పరిస్థితి ఇందుకు ఉదాహరణగా నిలుస్తోంది. కుటుంబానికి అండగా ఉండాల్సిన తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా, వృద్ధాప్యంలో ఉన్న అమ్మమ్మ సంరక్షణ బాధ్యతలు కూడా ఆ కుటుంబంపైనే ఉన్నాయి. చదువుకుంటూనే కుటుంబ పోషణ కోసం కష్టపడుతున్న ఆ యువకుడికి సొంత ఇల్లు కూడా లేకపోవడం దుర్భర పరిస్థితిని తెలియజేస్తోంది.ఇలాంటి కుటుంబాలకు ప్రభుత్వ పథకాలు అండగా నిలవాల్సిన సమయంలో, అధికారుల సర్వేలు, స్థానిక నాయకుల నిర్లక్ష్యం కారణంగా అర్హత ఉన్నా ప్రయోజనం దక్కడం లేదనే ఆవేదన వ్యక్తమవుతోంది. ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నా సొంతింటి కల నెరవేరకపోవడం ఆ కుటుంబాన్ని తీవ్ర నిరాశకు గురిచేస్తోంది. ప్రభుత్వ పథకాల ఎంపికలో రాజకీయ అనుబంధాలకు తావులేకుండా పారదర్శకత పాటించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. కానీ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను పరిశీలించకుండా నివేదికలు రూపొందిస్తే అసలైన నిరుపేదలకు న్యాయం ఎలా జరుగుతుందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

ఎమ్మెల్యే కనకయ్య జోక్యం చేసుకోవాలి..

గార్ల మండలంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియపై సమగ్ర విచారణ జరిపించాలని, అర్హత ఉన్నప్పటికీ ఇళ్లు మంజూరు కాని నిరుపేద కుటుంబాలను మరోసారి క్షేత్రస్థాయిలో పరిశీలించాలని స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా అనారోగ్యంతో ఉన్న తల్లి, వృద్ధురాలైన అమ్మమ్మ బాధ్యతలు మోస్తూ చదువుకుంటూనే కుటుంబాన్ని పోషిస్తున్న నిరుపేద విద్యావంతుడి పరిస్థితిని ఎమ్మెల్యే కనకయ్య దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.పేదవాడికి కావాల్సింది పార్టీ జెండా కాదు.

నివసించడానికి ఓ గూడు.ప్రభుత్వ పథకాలు పార్టీ కార్యకర్తలకో, రాజకీయ పలుకుబడి ఉన్నవారికో మాత్రమే పరిమితం కాకూడదు. నిజమైన అర్హులను గుర్తించి, నిరుపేదలకు న్యాయం చేయడమే సంక్షేమ పథకాల అసలైన లక్ష్యం. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అర్హులైన కుటుంబానికి ఇందిరమ్మ ఇంటి మంజూరుపై న్యాయం చేస్తారా? లేక ఆ కుటుంబం ఎదురుచూపులు కొనసాగాల్సిందేనా?

వంగవీటికి సమస్యలు స్వాగతం

కాకినాడ : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉన్న విజయవాడ నగరానికి కొత్త పాలకవర్గం కొలువుదీరింది. జనసేన పార్టీ నాయకుడు వంగవీటి రాధాకృష్ణ నగర మేయర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు 86 మంది కార్పొరేటర్లు కూడా ప్రమాణ స్వీకారం చేశారు. కొన్ని రాజకీయ విమర్శలు, వివాదాల మధ్య ఈ కార్యక్రమం పూర్తయి నగరంలో కొత్త పాలనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాధా చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇప్పటివరకు ఉన్న పరిస్థితులకు భిన్నంగా విజయవాడ రూపురేఖలను మార్చేలా పనిచేస్తామని ఆయన సంకేతాలు ఇవ్వడంతో నగరవాసుల్లో కొత్త ఆశలు మొదలయ్యాయి.అయితే మేయర్‌గా బాధ్యతలు చేపట్టిన రాధాకు ముందున్న పనులు అంత తేలికైనవి కావు. నగరంలో చాలా కాలంగా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్న సమస్యలు అనేకం ఉన్నాయి. ముఖ్యంగా ట్రాఫిక్ సమస్య విజయవాడ ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. అమరావతి రాజధాని ప్రాంతానికి విజయవాడ ప్రధాన వాణిజ్య కేంద్రంగా ఉండటంతో నిత్యం వేలాది వాహనాలు నగరంలోకి వస్తుంటాయి. దీంతో ప్రధాన రహదారులపై రద్దీ పెరుగుతోంది. బెంజ్ సర్కిల్ విస్తరణ ప్రతిపాదన చాలాకాలంగా చర్చల్లో ఉన్నప్పటికీ పూర్తిస్థాయిలో కార్యరూపం దాల్చలేదు. అలాగే ఏలూరు రోడ్డు లో కొత్త పంతెన నుంచి బస్టాండ్ వరకు రహదారి విస్తరణ పనులు కూడా ముందుకు సాగాల్సి ఉంది.నగరంలో ఫ్లైఓవర్ల నిర్మాణం, రహదారుల అభివృద్ధి వంటి అంశాలపైనా కొత్త మేయర్ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. శివారు ప్రాంతాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతున్నప్పటికీ ప్రధాన నగరంలోని కొన్ని ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు ఆశించిన స్థాయిలో లేవనే అభిప్రాయాలు ఉన్నాయి. పారిశుధ్యం, డ్రైనేజీ, తాగునీటి సరఫరా, రహదారుల నిర్వహణ వంటి సమస్యలకు ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది.మరో కీలకమైన అంశం కొండ ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ఇళ్ల పట్టాల పంపిణీ. సుమారు 2.3 లక్షల మందికి పట్టాలు అందించాల్సి ఉందనే అంశం ప్రస్తావనలో ఉంది. ఈ ప్రక్రియను సంబంధిత ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు తీసుకెళ్లడం మేయర్‌కు మరో ముఖ్యమైన బాధ్యతగా మారనుంది. ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని అక్కడి ప్రజలు ఆశిస్తున్నారు.అభివృద్ధి పనులతో పాటు రాజకీయ సమన్వయం కూడా రాధాకు పెద్ద పరీక్ష కానుంది. విజయవాడ కార్పొరేషన్‌లో జనసేనకు 19 మంది కార్పొరేటర్లు ఉండగా, తెలుగుదేశం పార్టీకి 53 మంది సభ్యులున్నారు. ఈ నేపథ్యంలో కూటమి పార్టీల మధ్య సమన్వయం కొనసాగించడం కీలకం. నగర అభివృద్ధికి సంబంధించిన నిర్ణయాల్లో అందరినీ కలుపుకొని వెళ్లాల్సి ఉంటుంది.వంగవీటి రంగా వారసుడిగా రాధాకు విజయవాడలో ప్రత్యేక గుర్తింపు ఉంది. అయితే ఆ గుర్తింపును మించి తన పనితీరుతో ప్రజల మనసులు గెలుచుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు ఆయనపై ఉంది. రాజకీయ వారసత్వం పదవిని అందించవచ్చు కానీ ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే అభివృద్ధి పనులే కొలమానం. విజయవాడకు కొత్త రూపు తీసుకురావాలన్న లక్ష్యాన్ని రాధా ఎంతవరకు నెరవేరుస్తారో రాబోయే రోజుల్లో తేలనుంది.రాధాకృష్ణన్ అందుకే వంగవీటి రాధా క్రిష్ణ అంటే అందరికీ తెలుసు. విజయవాడ తూర్పు ఎమ్మెల్యేగా 2004లో గెలిచిన రాధా క్రిష్ణ దివంగత నేత వంగవీటి రంగా కుమారుడు అన్నది ఇంకా బాగా తెలుసు. షార్ట్ కట్ లో రాధా అని కూడా బాగా పాపులర్. కానీ విజయవాడ మేయర్ గా ఆయన ప్రమాణం చేస్తున్నప్పుడు తన పేరు వంగవీటి రాధాకృష్ణన్ అని పలికారు. దాంతో సభలో ఉన్న వారు ఏమిటి ఆయన తప్పు చదువుతున్నారా లేక తాము తప్పుగా విన్నామా అన్న డౌట్ లో పడిపోయారు. అయితే రాధా తన పేరుని కరెక్ట్ గానే చదివారు అని అంతా కరెక్ట్ గానే విన్నారు అన్నది తరువాత తెలిసింది. మరి రాధా క్రిష్ణ అన్న తెలుగు పేరు కదా ఈ తమిళ్ కలిసిన క్రిష్ణన్ అన్న పేరు ఎలా వచ్చింది అన్నదే ఇపుడు అంతా ఆలోచిస్తున్నారు. అయితే ఈ పేరు వెనక ఒక స్టోరీ ఉంది. అది ఇంట్రెస్టింగ్ గానే ఉంది. జనాలందరికీ రాధా క్రిష్ణగా పేరుతో పరిచయం ఉన్నా ఆయన పూర్తి పేరు వంగవీటి రాధాక్రిష్ణన్. అలాగే ఆయన పేరు ప్రభుత్వ రికార్డుల్లో ఉంది. అందుకే విజయవాడ నగర పాలక సంస్థ నూతన మేయర్‌గా ఆయన ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా వంగవీటి రాధాకృష్ణన్ అనే నేను అని పలికారు. అయితే ఈ కొత్త పేరుపై చర్చ అంతటా మొదలైంది. కానీ దీని వెనుక ఉన్న అసలు కారణం ఉంది. స్కూల్ రికార్డుల ప్రకారం అదే పేరు ఉంది. రాధా తల్లిదండ్రులు మొదట వంగవీటి రాధాకృష్ణ అనే పేరు పెట్టారు. అది రాధా పెద నాన్న పేరు. అయితే రాధాని ఆయన చిన్నతనంలో తమిళనాడులోని ఊటీలో పాఠాశాలలో చదివించారు. అలా ఆయన చదువుకునే సమయంలో అక్కడ పాఠశాల అధికారులు తమిళ శైలిలో ఆయన పేరు చివర ‘న్’ చేర్చి రాధాకృష్ణన్ గా స్కూల్ రికార్డులలో నమోదు చేశారు.ఆ తరువాత అదే కొనసాగుతూ అధికారిక ధృవపత్రాలలోనూ ఉంది. అప్పటి నుంచి ఆయన చదువుకున్న సర్టిఫికెట్లు, పాస్‌పోర్ట్, ఎన్నికల అఫిడవిట్లు ఇతర ప్రభుత్వ రికార్డులన్నింటిలోనూ అదే పేరు కొనసాగుతోంది. ఇక బయట ప్రజలకు, రాజకీయ వర్గాలకు ఆయన వంగవీటి రాధా లేదా రాధాకృష్ణగా సుపరిచితులైనప్పటికీ, చట్టపరమైన నిబంధనల ప్రకారం మేయర్ ప్రమాణ స్వీకారంలో తన అధికారిక పేరునే ఉపయోగించారు. అదన్న మాట సంగతి. మొత్తం మీద చూస్తే వంగవీటి రాధా క్రిష్ణన్ అన్నది ఆయన అసలు పేరు అని మేయర్ ప్రమాణం సందర్భంగా అంతా సరి కొత్తగా తెలుసుకున్నారు. దేశ ఉప రాష్ట్రపతిగా సీపీ రాధాక్రిష్ణన్ ఉన్నారు. అలాగే . ఇపుడు విజయవాడ మేయర్ గా రాధాక్రిష్ణన్ ఉన్నారు అని అంతా అంటున్నారు. తమిళనాడులో పుట్టి దేశానికి రాష్ట్రపతి అయిన రాధాక్రిష్ణన్ స్ఫూర్తితో అనేక మంది ఆ పేరుని పెట్టుకుంటారు ఇది ఎక్కువగా తమిళనాడులో జరుగుతుంది.

లక్షల డాలర్లకు ఆశపడి.. దేశ రహస్యాలు

అమ్మేసిన చైనా అధికారికి మరణశిక్ష!

- విదేశీ మహిళా స్పై వలలో చిక్కినట్లు వెల్లడి
- లక్షలాది యువాన్లు తీసుకుని రహస్యాలు లీక్
- 'మా' ఇంటిపేరు గల అధికారికి శిక్ష పడినట్లు ప్రకటన
- సోషల్ మీడియా ద్వారా వివరాలు బయటపెట్టిన చైనా ఏజెన్సీ

చైనా: విదేశీ గూఢచారి సంస్థలకు దేశ రహస్యాలను లీక్ చేశాడన్న తీవ్ర ఆరోపణలపై చైనాలో ఓ ప్రభుత్వ అధికారికి మరణశిక్ష విధించారు. ఈ సంచలన విషయాన్ని చైనాకు చెందిన నేషనల్ అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ స్టేట్ సీక్రెట్ ప్రొటెక్షన్ (బామిగువాన్) సోషల్ మీడియా ద్వారా నవంబర్ 23న అధికారికంగా వెల్లడించింది. ఈ ఘటన చైనా అధికార వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఏజెన్సీ కథనం ప్రకారం, శిక్ష పడిన అధికారి ఇంటిపేరు 'మా'. గతంలో విదేశాల్లో పనిచేస్తున్న సమయంలో 'కైలిన్' అనే మారుపేరు గల ఓ విదేశీ మహిళా గూఢచారితో ఆయనకు పరిచయం ఏర్పడింది. చైనీస్ భాష నేర్చుకోవాలనే నెపంతో ఆమె 'మా'తో సాన్నిహిత్యం పెంచుకుని, ఆ తర్వాత 'టాంగ్ జెంగ్' అనే మరో నిఘా అధికారికి పరిచయం చేసింది. కొంతకాలానికి, గతంలో 'మా' చేసిన కొన్ని నిబంధనల ఉల్లంఘనలను అడ్డుపెట్టుకుని, వారు ఆయనను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించారు. తమతో సహకరించకపోతే ఆ వివరాలను చైనా ప్రభుత్వానికి అందిస్తామని బెదిరించారు. ఈ ఒత్తిడికి లొంగిపోయిన 'మా', గూఢచర్యానికి అంగీకరించాడు. వారు ప్రత్యేకంగా ఇచ్చిన ల్యాప్‌టాప్ ద్వారా డజన్ల కొద్దీ జాతీయ రహస్యాలను విదేశీ ఏజెన్సీకి చేరవేశాడు. ఈ సమాచారం అందించినందుకు ప్రతిఫలంగా 'మా' మిలియన్ యువాన్లకు పైగా (సుమారు 1,50,000 డాలర్లు) అందుకున్నట్లు అధికారులు తెలిపారు. ఈ నేరం రుజువు కావడంతో కోర్టు అతడికి మరణశిక్ష విధించింది. జీవితాంతం రాజకీయ హక్కులను రద్దు చేయడంతో పాటు, వ్యక్తిగత ఆస్తులన్నింటినీ జప్తు చేయాలని ఆదేశించింది. అయితే, ఈ గూఢచర్యం వెనుక ఏ దేశం ఉంది? నిందితుడి పూర్తి వివరాలు ఏంటి? శిక్ష ఎప్పుడు అమలు చేస్తారు? అనే అంశాలను చైనా ప్రభుత్వం గోప్యంగా ఉంచింది. కీలక పదవుల్లో ఉన్న అధికారులను లక్ష్యంగా చేసుకుని విదేశీ ఏజెన్సీలు ఇలాంటి వలలు పన్నుతాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఈ ఘటన ద్వారా తమ దేశ పౌరులను, అధికారులను చైనా ప్రభుత్వం హెచ్చరించింది.

కమలంలో పెరుగుతున్న అసహనం

విశాఖపట్టణం : ఏపీ బీజేపీలో అసంతృప్తి బాహాటం అవుతోంది. తమకు స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన అవకాశాలు దక్కలేదని కాషాయం పార్టీలో చర్చ సాగుతోంది. చాలా మంది మౌనంగా ఉంటే కొంత మంది బయటకు వచ్చి మాట్లాడుతున్నారు. మొన్న కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ భీమవరంలో తమకు తక్కువ వార్డులు ఇచ్చారని

వెంకటరెడ్డి నగర్ అసోసియేషన్
ఎన్నికలకు నామినేషన్ల పర్వం ప్రారంభం

అధ్యక్షుడిగా శివకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా
ఏకాంతరావు నామినేషన్ల దాఖలు



ఉప్పల్ (ప్రశ్న న్యూస్) వెంకటరెడ్డి నగర్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికకు మంగళవారం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్ష పదవికి మూసిగంపల శివకుమార్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పదవికి అద్దంకి ఏకాంతరావు తమ నామినేషన్ పత్రాలను సమర్పించారు. వెంకటరెడ్డి నగర్‌లోని శ్రీ సద్గురు సాయినాథ దేవాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఎన్నికల కోర్ కమిటీకి అధ్యక్ష పదవికి పోటీ చేస్తున్న శివకుమార్ గౌడ్ రూ.50 వేల ధరావత్ చెల్లించి తన నామినేషన్ పత్రాలను అందజేశారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శి పదవికి పోటీ చేస్తున్న అద్దంకి ఏకాంతరావు రూ.25 వేల ధరావత్ చెల్లించి తన నామినేషన్ పత్రాలను ఎన్నికల కోర్ కమిటీ సభ్యులకు సమర్పించారు. ఎన్నికల కోర్ కమిటీ కన్వీనర్ పెద్దింటి బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు బిళ్ళకంటి యాదయ్య, వేములకొండ సోమశేఖర్ గౌడ్, డాక్టర్ బి.వి. చారి, గాదే శంకరయ్య గౌడ్, వేములకొండ వెంకన్న గౌడ్, ఎడిగే లక్ష్మయ్య, జి. యాదమ్మ, ఆకారపు అరుణ్ కుమార్ తదితరులు నామినేషన్ల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కాలనీవాసులు, యువత, మహిళలు పెద్ద ఎత్తున హాజరయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నికల నేపథ్యంలో కాలనీలో సందడి నెలకొంది. నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం కావడంతో ఎన్నికలపై కాలనీవాసుల్లో ఆసక్తి నెలకొంది.

కార్తీక పౌర్ణమి వేళ..
ఇంద్రకీలాద్రికి భక్తజన నీరాజనం

- కనులపండువగా అమ్మవారి గిరి ప్రదక్షిణ
- మంగళవాయిద్యాలు.. వేదమంత్రాలు..
- భజన సంకీర్తనల నడుమ ఆధ్యాత్మిక శోభ



ఇంద్రకీలాద్రి (ప్రశ్న న్యూస్) కార్తీక పౌర్ణమి పర్వదినం.. ఆధ్యాత్మిక పరిమళాలతో ఇంద్రకీలాద్రి పులకించింది. సకల దేవతల నిలయమైన పవిత్ర ఇంద్రకీలాద్రి చుట్టూ గిరి ప్రదక్షిణ చేస్తే సకల పాపాలు తొలగి, కోరిన కోర్కెలు నెరవేరుతాయన్న భక్తుల ప్రగాఢ విశ్వాసం మధ్య గిరి ప్రదక్షిణ మహోత్సవం మంగళవారం ఉదయం అత్యంత వైభవంగా సాగింది. వేలాదిమంది భక్తులు భక్తిశ్రద్ధలతో అడుగులో అడుగు వేస్తూ అమ్మవారి నామస్మరణతో కొండ చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఎటుచూసినా భక్తిపారవశ్యం.. మరోవైపు వేదమంత్ర ఘోష.. మంగళవాయిద్యాల నడుమ ఇంద్రకీలాద్రి ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లింది.

విశేష పూజలతో శ్రీకారం..

కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఘాట్ రోడ్ ప్రవేశ ద్వారం వద్ద ఉన్న శ్రీ కామధేను అమ్మవారి సన్నిధి నుంచి గిరి ప్రదక్షిణ కార్యక్రమం ప్రారంభమైంది. స్థానాచార్య వి. శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ బొర్రా రాధాకృష్ణ (గాంధీ), ఈవో శీనా నాయక్ పూజా కార్యక్రమాల్లో పాల్గొని గిరి ప్రదక్షిణకు శ్రీకారం చుట్టారు.

కొండ చుట్టూ భక్తి ప్రదక్షిణ..

ఘాట్ రోడ్డులోని శ్రీ అమ్మవారి గుడి నుంచి ప్రారంభమైన ప్రదక్షిణ కుమ్మరిపాలెం సెంటర్, విద్యాధరపురం, పాలఫ్యాక్టరీ, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణవీధి మీదుగా సాగి తిరిగి ఇంద్రకీలాద్రికి చేరుకుంది. ప్రదక్షిణ మార్గమంతా దేవస్థానం అధికారులు భక్తులకు అమ్మవారి కుంకుమ, ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కార్యక్రమం నిర్దిష్ట మార్గంలో కొనసాగింది.

పౌర్ణమి వేళ ప్రదక్షిణతో పుణ్యఫలం..

కార్తీక మాసంలో పౌర్ణమి రోజున ఇంద్రకీలాద్రి గిరి ప్రదక్షిణ చేయడం విశేష పుణ్యప్రదమని పండితుల విశ్వాసం. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివారు, శ్రీ విఘ్నేశ్వరుడు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి, శ్రీ ఆంజనేయస్వామి తదితర దేవతలు కొలువైన పవిత్ర కొండ చుట్టూ ప్రదక్షిణ చేయడం భక్తులకు ఆధ్యాత్మిక ఆనందాన్ని అందించింది.

వేలాదిమంది భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవారిని, స్వామివారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ బోర్డు సభ్యురాలు పద్మావతి ఠాకూర్, ముఖ్య అర్చకులు ఆర్. శ్రీనివాసశాస్త్రి, ఫెస్టివల్స్ సెక్షన్ ఏఈవో డాక్టర్ కె. గంగాధర్, సూపరింటెండెంట్ హేమ దుర్గాంబ, సీనియర్ అసిస్టెంట్ శిరీష తదితరులు పాల్గొన్నారు.

"నో ఎన్ఓసి",నో డెవలప్మెంట్-ఎమ్మెల్యే

- అభివృద్ధికి అడ్డుగోడలుగా మారిన బోర్డు నిబంధనలు
- సెంట్రల్ బ్యాటరీ అభివృద్ధిపై కంటోన్మెంట్ నేతల గళం
- రక్షణ మంత్రిత్వ శాఖ నిర్లక్ష్యం బోర్డు ప్రజలకు శాపం.అలుపెరగని ఉద్యమం ఎమ్మెల్యే ది, అడుగు అభివృద్ధికి నోచుకోని వైనం
- రూ.303 కోట్ల నిధులకు కేంద్రం అనుమతులు ఇప్పించాలని ఈటలకు డిమాండ్



కంటోన్మెంట్(ప్రశ్న న్యూస్) కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలోని బస్తీలలో మౌలిక సదుపాయాల కల్పనలో కేంద్ర రక్షణ మంత్రిత్వ శాఖ,స్థానిక ఎంపీ ఈటల రాజేందర్ పూర్తిగా విఫలమయ్యారని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఆరోపించారు.అలాగే 'నవ కంటోన్మెంట్ నిర్మాణం' లో భాగంగా నిన్న మంగళవారం వార్డు 7 పరిధిలోని సెంట్రల్ బ్యాటరీ బస్తీలో పర్యటించి స్థానికులతో ముఖాముఖిగా చర్చించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు వెయ్యి కుటుంబాలు నివసిస్తున్న ఈ ప్రాంతంలో కనీస వసతులు లేకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.బస్తీలో సరైన రోడ్లు,భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ,వీధి దీపాలు లేక ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారని స్థానికులు పేర్కొన్నారు.కనీస అవసరాలైన మంచినీరు, సామూహిక మరుగుదొడ్ల సదుపాయం కూడా లేకపోవడంపై కంటోన్మెంట్ బోర్డు తీరును ప్రశ్నించారు.రక్షణ శాఖ భూములనే సాకుతో అభివృద్ధి పనులను అడ్డుకోవడం ఏమాత్రం సమంజసం కాదని అన్నారు.డబుల్ ఇంజన్ సర్కార్ అంటూ గొప్పలు చెప్పుకునే బీజేపీ నాయకులు కంటోన్మెంట్ ప్రజల దుస్థితికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.2020లోనే జరగాల్సిన బోర్డు ఎన్నికలను ఇప్పటికీ నిర్వహించకుండా ప్రజలకు ప్రాతినిధ్యం లేకుండా చేయడం ప్రజాస్వామ్య విరుద్ధమనివిమర్శించారు.నామినేటెడ్ సభ్యుడితో పాలన సాగిస్తూ ప్రజల గొంతు నొక్కడం సరికాదన్నారు.2027 సమీపిస్తున్నా ఎన్నికల ఊసే లేకపోవడం కేంద్ర వైఖరికి నిదర్శనమని మండిపడ్డారు. కంటోన్మెంట్ బోర్డు వద్ద నిధులు లేవన్న కారణంతో సీఎం రేవంత్ రెడ్డి చొరవ తీసుకుని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినా బోర్డు అధికారుల నుంచి నిరభ్యంతర పత్రం రాకపోవడంతో ఆ పనులు నిలిచిపోయాయని తెలిపారు.అదేవిధంగా సెంట్రల్ బ్యాటరీ,సాయిబాబా హట్స్,చిన్న కమ్మెల,108 బజార్, బోయినపల్లి, మడ్ ఫోర్ట్ ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.303 కోట్ల నిధులతో పాటు భూ మార్పిడి (ఎక్స్చేంజ్ ఆఫ్ ల్యాండ్) ప్రతిపాదనలను సిద్ధం చేసిందని వివరించారు. కేంద్ర రక్షణ శాఖ స్థాయిలో క్లియరెన్స్‌లు పెండింగ్‌లో ఉండటం వల్లే అభివృద్ధి ముందుకు సాగడం లేదని,ఎంపీ ఈటల రాజేందర్ కంటోన్మెంట్‌కు ఒక పర్యాటకుడిలా వచ్చి వెళ్లడం మానుకోవాలని నేతలు హితవు పలికారు.కొత్తగా నిధులు తేవాల్సిన అవసరం లేదని,రాష్ట్ర ప్రభుత్వం సిద్ధం చేసిన రూ.303 కోట్ల నిధుల ఫైలుకు, భూ మార్పిడి ప్రక్రియకు ఢిల్లీ,పూణే స్థాయిలో అధికారులతో మాట్లాడి అనుమతులు ఇప్పిస్తే చాలనిసూచించారు. డిఫెన్స్, ఏవియేషన్ భూముల్లో నివసించే వారు కూడా ఈ దేశ పౌరులేనని ,సివిల్ ప్రాంతాల తరహాలోనే వీరికి అన్ని వసతులు కల్పించాలని కోరారు. కంటోన్మెంట్ బోర్డు సీఈఓ,బ్రిగేడియర్ తక్షణమే స్పందించి అభివృద్ధికి ఉన్న ఆటంకాలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు మురళి ముదిరాజ్, నాగినేని సరిత, రవీందర్ గుప్తా,ప్రదీప్ చోటు,శ్యామ్,శ్రీనివాస్, రాజేందర్, నిర్మలమ్మ, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

బెడ్ రూమ్ లోని మాటలను పసిగడుతున్న యాప్‌లు

- వ్యక్తిగత జీవితంపై నిఘా
- బెడ్ రూమ్ నూ గొప్యతకు గ్యారెంటీ లేదా



మేడ్చల్ (ప్రశ్న న్యూస్) మనిషికి ఇంటి బయట ఎన్నో సమస్యలు, బాధ్యతలు ఉంటాయి. కనీసం ఇంట్లోనైనా ప్రశాంతంగా ఉండాలని, ముఖ్యంగా బెడ్‌రూమ్‌లో మాట్లాడే విషయాలు తమకే పరిమితం కావాలని ప్రతి ఒక్కరూ కోరుకుంటారు. కానీ ప్రస్తుతం చేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్‌లు, వాటిలోని యాప్‌ల వినియోగం వ్యక్తిగత గోప్యతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది.

ఫోన్‌లో మాట్లాడుకున్న విషయం కొద్దిసేపటికే సోషల్ మీడియాలో ప్రకటనగా కనిపించడం, స్నేహితులతో చర్చించిన వస్తువులే ఆన్‌లైన్‌లో సూచనలుగా రావడం వంటి అనుభవాలు చాలామందిలో అనుమానాలు పెంచుతున్నాయి. అసలు మన ఫోన్ మన మాటలు వింటోందా? మన వ్యక్తిగత సంభాషణలు ఎక్కడైనా రికార్డు అవుతున్నాయా? అనే ప్రశ్నలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతున్నాయి.

గోప్యతకు ముప్పుగా మారుతున్న స్మార్ట్‌ఫోన్‌లు

ఇటీవల వెలువడిన భారతీయ సర్వే వివరాలు కూడా ఈ అంశంపై ఆందోళనను పెంచుతున్నాయి. లోకల్‌సర్కిల్స్ నిర్వహించిన సర్వేలో 346 జిల్లాల నుంచి 63 వేలకు పైగా స్పందనలు వచ్చాయి. సుమారు మూడింట రెండొంతుల మంది తమ వ్యక్తిగత సంభాషణలకు సంబంధించిన ప్రకటనలు కనిపిస్తున్నాయని అభిప్రాయపడ్డారు. అయితే ఇవి ప్రజల అనుభవాలు మాత్రమే; యాప్‌లు రహస్యంగా మాటలు రికార్డు చేస్తున్నాయనడానికి ఈ సర్వే ఒక్కటే సాంకేతిక ఆధారం కాదు.

నిజంగానే యాప్‌లు మాటలు వింటున్నాయా.?

ఈ ప్రశ్నకు సమాధానం కొంత క్లిష్టమైనది. ఫోన్‌లోని ప్రతి యాప్ నిరంతరం మన మాటలు వింటోందని చెప్పడానికి విశ్వసనీయమైన ఆధారాలు లేవు. సాధారణంగా ప్రకటనల కోసం వినియోగదారుల మైక్రోఫోన్ ద్వారా రహస్యంగా సంభాషణలు సేకరిస్తున్నాయని కూడా నిరూపితం కాలేదు.

అయితే మైక్రోఫోన్ అనుమతి పొందిన యాప్‌లు అవసరమైన సందర్భాల్లో ఆడియోను ఉపయోగించగలవు. వాయిస్ అసిస్టెంట్లు, వాయిస్ రికార్డింగ్, వీడియో కాలింగ్ యాప్‌లకు మైక్రోఫోన్ అవసరం ఉంటుంది. అనవసరమైన యాప్‌లకు కూడా ఈ అనుమతి ఇవ్వడం ప్రమాదకరం.

బెడ్‌రూమ్‌లోనూ జాగ్రత్త అవసరమే

స్మార్ట్‌ఫోన్‌తో పాటు స్మార్ట్ టీవీలు, వాయిస్ అసిస్టెంట్లు, ఇంటర్నెట్‌కు అనుసంధానమైన కెమెరాలు వంటి పరికరాలు కూడా ఇంట్లో వ్యక్తిగత సమాచారాన్ని సేకరించే అవకాశం కలిగి ఉంటాయి. వాటి మైక్రోఫోన్‌లు, కెమెరాలు ఎలా పనిచేస్తున్నాయో తెలుసుకోవడం అవసరం. ముఖ్యంగా భార్యాభర్తల వ్యక్తిగత సంభాషణలు, కుటుంబ సమస్యలు, ఆర్థిక విషయాలు, ఆరోగ్యానికి సంబంధించిన చర్చలు వంటి సున్నితమైన సమాచారాన్ని పంచుకునేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి.

ప్రకటనలు మన మాటలతోనే వస్తున్నాయా.?

మనం ఒక వస్తువు గురించి మాట్లాడుకున్న వెంటనే అదే వస్తువుకు సంబంధించిన ప్రకటనలు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లో కనిపిస్తే ఫోన్ మన మాటలు వింటోందనే అనుమానం కలుగుతుంది. కానీ దీనికి మరో కారణం కూడా ఉంది.

మనం గతంలో చేసిన గూగుల్ సెర్చ్‌లు.
చూసిన వీడియోలు, వెబ్‌సైట్లు.
ఆన్‌లైన్ షాపింగ్ వివరాలు
మన లొకేషన్, ఆసక్తులు, యాప్ వినియోగ అలవాట్లు.
మనకు పరిచయమైన వ్యక్తుల ఆన్‌లైన్ కార్యకలాపాలు.

ఈ సమాచారాన్ని విశ్లేషించి ప్రకటనలు చూపించే సాంకేతికత ఇప్పటికే అందుబాటులో ఉంది. అందువల్ల ఫోన్ మాటలు వినకుండానే మన ఆసక్తులను అంచనా వేయగలదు.

మీ ఫోన్‌లో ఈ జాగ్రత్తలు పాటించండి

ప్రతి ఒక్కరూ తెలుసుకోవాల్సినవి

అవసరం లేని యాప్‌లకు మైక్రోఫోన్ అనుమతులు తొలగించండి.
ఫోన్ సెట్టింగ్స్‌లో ప్రైవసీ డాష్ బోర్డ్ పరిశీలించండి.
కెమెరా, మైక్రోఫోన్ ఎప్పుడు ఉపయోగిస్తున్నాయో గమనించండి.
తెలియని లింకులు, ఏపీకే ఫైళ్లు డౌన్‌లోడ్ చేయవద్దు.
నమ్మకం లేని యాప్‌లలో వ్యక్తిగత వివరాలు నమోదు చేయవద్దు.
స్మార్ట్ టీవీలు, వాయిస్ అసిస్టెంట్ల ప్రైవసీ సెట్టింగ్స్ కూడా పరిశీలించండి.

ముఖ్యంగా: ఆండ్రాయిడ్ ఫోన్‌లలో మైక్రోఫోన్ ఉపయోగిస్తున్నప్పుడు సాధారణంగా స్క్రీన్ పైభాగంలో ఆకుపచ్చ సూచిక కనిపిస్తుంది. దానిపై నొక్కి ఏ యాప్ మైక్రోఫోన్‌ను ఉపయోగిస్తోందో తెలుసుకోవచ్చు.

ముగింపు: నాలుగు గోడల మధ్య కూడా గోప్యత కరువవుతోందా.?

సాంకేతిక పరిజ్ఞానం మన జీవితాలను సులభతరం చేయాలి కానీ మన వ్యక్తిగత జీవితాల్లోకి చొరబడకూడదు. ఫోన్ మనకు అవసరమైన సాధనం మాత్రమే తప్ప మన జీవితాన్ని నిరంతరం గమనించే నిఘా పరికరంగా మారకూడదు.బెడ్‌రూమ్‌లో మాట్లాడే మాటలు, కుటుంబ సభ్యుల మధ్య జరిగే చర్చలు వ్యక్తిగతంగానే ఉండాలి. యాప్‌లకు అనుమతులు ఇచ్చే ముందు వాటి అవసరాన్ని పరిశీలించాలి. ఉచితంగా లభించే ప్రతి యాప్ వెనుక మన డేటా సేకరణ ఉండే అవకాశాన్ని గుర్తించాలి.టెక్నాలజీ పెరుగుతున్న కొద్దీ మనిషి గోప్యత తగ్గిపోకూడదు. ఇంటి తలుపులు మూసుకున్నా.. మన వ్యక్తిగత సమాచారం మాత్రం డిజిటల్ ప్రపంచంలో బహిర్గతం కాకూడదు.

తిరుమల యాత్రలో మృత్యువాత పడినా
కుటుంబాలకు రూ.2 లక్షల భరోసా

- దేశంలోనే తొలిసారిగా 'శ్రీవారి యాత్ర సురక్ష' బీమా పథకం
- రెండు నెలల్లో 17 మంది భక్తుల మృతి.. ఏడుగురి కుటుంబాలకు పరిహారం అందజేత
- ప్రమాద మరణానికి రూ.10 లక్షలు.. సహజ మరణానికి రూ.2 లక్షలు
- టీటీడీ చైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్ర వెల్లడి



తిరుమల(ప్రశ్న న్యూస్) శ్రీవారి దర్శనానికి కొండపైకి వచ్చిన భక్తుల కుటుంబాలకు టీటీడీ అండగా నిలుస్తోంది. తిరుమల యాత్రలో అనుకోని విషాదం చోటుచేసుకుని కుటుంబ పెద్దను కోల్పోయిన వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు 'శ్రీవారి యాత్ర సురక్ష' బీమా పథకాన్ని అమలు చేస్తోంది. దేశంలోనే తొలిసారిగా భక్తుల యాత్రకు బీమా రక్షణ కల్పిస్తున్నామని టీటీడీ సాధికారిక మండలి చైర్మన్, ఈవో ముద్దాడ రవిచంద్ర వెల్లడించారు.

గత రెండు నెలల్లో తిరుమలలో సహజంగా మరణించిన ఏడుగురు భక్తుల కుటుంబాలకు మంగళవారం రూ.2 లక్షల చొప్పున బీమా పరిహారాన్ని అందజేశారు. టీటీడీ అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, ఎల్ఐసీ ఆఫ్ ఇండియా సీఈవో, ఎండీ ఆర్.దొరైస్వామితో కలిసి బాధిత కుటుంబాలకు చెక్కులు అందించారు. ఈ సందర్భంగా పలువురు కుటుంబ సభ్యులు కన్నీటి పర్యంతమయ్యారు. కష్టకాలంలో ఆర్థికంగా అండగా నిలిచిన టీటీడీకి కృతజ్ఞతలు తెలిపారు.

రెండు నెలల్లో 17 మంది మృతి..

సెప్టెంబర్ 9న ప్రారంభించిన ఈ పథకం కింద సహజ మరణం సంభవిస్తే రూ.2 లక్షలు, ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షల బీమా పరిహారం అందించనున్నట్లు ఈవో తెలిపారు. గత రెండు నెలల్లో తిరుమలలో మొత్తం 17 మంది భక్తులు మరణించగా, వారిలో ఏడుగురి కుటుంబాలకు ఇప్పటికే పరిహారం అందించినట్లు చెప్పారు. మిగిలిన కుటుంబాలకు కూడా త్వరలో బీమా సొమ్ము అందిస్తామని వెల్లడించారు.

ఏడుగురు కుటుంబాలకు ఆర్థిక చేయూత..

దాదాపు ఏడాదిన్నరపాటు కృషి చేసి టీటీడీ కోసం ప్రత్యేకంగా ఈ బీమా పథకాన్ని రూపొందించినట్లు అదనపు ఈవో వెంకయ్య చౌదరి తెలిపారు. భక్తుల కుటుంబాలకు ఆపత్కాలంలో అండగా నిలిచేలా ఈ కార్యక్రమాన్ని తీసుకొచ్చామని, భవిష్యత్తులో పరిహారాన్ని మరింత పెంచేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. మరణ ధ్రువీకరణ పత్రం, నామినీ బ్యాంకు ఖాతా వివరాలు అందిన వెంటనే పరిహారం చెల్లించేలా వ్యవస్థను ఏర్పాటు చేసినట్లు ఎల్ఐసీ సీఈవో, ఎండీ ఆర్.దొరైస్వామి తెలిపారు. టీటీడీ ప్రవేశపెట్టిన ఈ పథకం ఇతర ప్రముఖ ఆలయాలకూ ఆదర్శంగా నిలుస్తోందన్నారు. శబరిమలలోని ట్రావెన్‌కోర్ దేవస్థానం, జమ్మూలోని వైష్ణోదేవి ఆలయ అధికారులు సైతం ఈ విధానంపై తమను సంప్రదించినట్లు వెల్లడించారు.

కన్నీటి పర్యంతమైన కుటుంబ సభ్యులు..

బీమా పరిహారం అందుకున్న వారిలో తమిళనాడుకు చెందిన పప్పాతి, మహాలక్ష్మి, నీలవేణి, విశ్వనాథన్ రామకృష్ణన్, హైదరాబాద్‌కు చెందిన భాగ్యమ్మ, గుంటూరుకు చెందిన దామోదరరావు, చెన్నైకు చెందిన గోపినాథ్ కుటుంబ సభ్యులు ఉన్నారు. తమ ఆత్మీయులను కోల్పోయిన బాధలో ఉన్నప్పటికీ, ఈ క్లిష్ట సమయంలో టీటీడీ ఆర్థిక సహాయం అందించడం తమకు ఎంతో ఊరటనిచ్చిందని వారు భావోద్వేగానికి గురయ్యారు.శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రతతోపాటు, అనుకోని విషాదం ఎదురైనప్పుడు వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంలోనూ 'శ్రీవారి యాత్ర సురక్ష' పథకం కీలకంగా మారుతోంది.

ఆరోగ్యశాఖలో అవినీతి అనారోగ్యమా.?

- ఆయుర్వేద మందుల సరఫరాలో అంతులేని నిర్లక్ష్యమా.?- డిస్పెన్సరీలకు మందులు చేరుతున్నాయా.? రోగులకు అందుతున్నాయా.?
- కాటేదాన్ ఫార్మసీ తయారీ నాణ్యతపై విచారణ ఏదీ.?- ఒక్కో ఆసుపత్రికి నెలవారీగా ఎంత మందుల కోటా.. ఎన్ని మందులు సరఫరా చేస్తున్నారు.?
- మంత్రి దామోదర్ రాజనర్సింహ తక్షణమే స్పందించాలి- ఏసీబీ, విజిలెన్స్ విచారణకు ప్రజల డిమాండ్



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాల్సిన ఆరోగ్యశాఖలోనే అవినీతి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోందా.? పేద, మధ్యతరగతి ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్యం అందించాల్సిన ఆయుర్వేద వైద్యవ్యవస్థ నిర్లక్ష్యానికి నిలయంగా మారుతోందా.? తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఆయుర్వేద డిస్పెన్సరీలు, ఆసుపత్రుల్లో మందుల సరఫరాపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అవసరమైన అన్ని రకాల మందులు అందుబాటులో లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అసలు ప్రభుత్వం కేటాయిస్తున్న మందుల బడ్జెట్ ఎంత.? తయారవుతున్న మందుల పరిమాణం ఎంత.? ఆసుపత్రులకు చేరుతున్నది ఎంత.? రోగులకు అందుతున్నది ఎంత.? ఈ లెక్కలన్నీ బహిర్గతం చేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

మందుల కోటా ఎక్కడికి పోతోంది.?

రాష్ట్రంలోని ఒక్కో ఆయుర్వేద డిస్పెన్సరీకి, ఆయుర్వేద ఆసుపత్రికి నెలవారీగా ఎంత పరిమాణంలో మందులు సరఫరా చేయాలి ? ప్రభుత్వం నిర్ణయించిన కోటా ఎంత.? వాస్తవంగా సరఫరా చేస్తున్నది ఎంత.? ఏ ప్రాతిపదికన మందుల పంపిణీ జరుగుతోంది.? రోగుల సంఖ్యకు అనుగుణంగా మందులు అందిస్తున్నారా.? లేక కాగితాలపైనే సరఫరా చూపిస్తున్నారా.? సరఫరా చేసిన మందులకు సంబంధించిన నిల్వల రిజిస్టర్లు, పంపిణీ రికార్డులు, రోగులకు ఇచ్చిన వివరాలను బహిర్గతం చేయగలరా.? వంటి అనేక సందేహాలకు అడిషనల్ డైరెక్టర్, ఫార్మసీ సూపర్డెంట్, ఉన్నత అధికారులు పూర్తి వివరాలు ఇవ్వాలని ప్రజలు కోరుతున్నారు.

కాటేదాన్ ఫార్మసీపై నాణ్యత పరీక్షలేవి.?

కాటేదాన్‌లోని ఆయుర్వేద ఫార్మసీలో తయారవుతున్న మందుల నాణ్యతపై సమగ్ర పరిశీలన జరిగిందా.? ముడిసరుకు కొనుగోళ్ల నుంచి తయారీ, నిల్వ, ప్యాకింగ్, పంపిణీ వరకు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నారా.?

తయారైన మందులకు క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు నిర్వహించి రిపోర్ట్ జారీ చేస్తున్నారా.? ప్రతి నెల ఎన్ని రకాల మందులు, ఎంత పరిమాణంలో తయారు చేస్తున్నారు.? వాటికి థర్డ్ పార్టీతో నాణ్యతా పరీక్షలు నిర్వహిస్తున్నారా.? నాణ్యత పరీక్షల నివేదికలను ప్రజలకు అందుబాటులో ఉంచుతున్నారా.? గడువు ముగిసిన మందులు, నాసిరకం మందులు రోగులకు చేరకుండా ఎలాంటి పర్యవేక్షణ చేస్తున్నారు.? అన్న దానిపై ఉన్నత అధికారులు పూర్తిస్థాయిలో వివరాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

అన్ని వ్యాధులకు మందులున్నాయా.?

జ్వరం,మధుమేహం, రక్తపోటు, కీళ్లనొప్పులు, చర్మవ్యాధులు, నరాల బలహీనత, జీర్ణకోశ సమస్యలు తదితర వ్యాధులకు అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయా.? త్రిఫల, సునాముఖి, అశ్వగంధ, శతావరి, త్రిఫల, జటామాంసి, పునర్నవ, అతిబల, అతిమధురం, తిప్పతీగ వంటి ఔషధాల సరఫరా పరిస్థితి ఏమిటి.? మందులు లేవని చెప్పి రోగులను ప్రైవేటు మందుల దుకాణాలకు పంపిస్తున్నారా.? ఉచితంగా అందించాల్సిన మందులు బయట కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఎందుకు ఏర్పడుతోంది.? అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

యునాని మందుల సరఫరాపైనా ప్రశ్నలే

ఆయుర్వేదంతో పాటు యునాని వైద్యశాలల్లో మందుల సరఫరా, కొనుగోళ్లు, నిల్వలు, పంపిణీపై కూడా పారదర్శకత అవసరం. మందుల కొనుగోళ్లలో టెండర్ల ప్రక్రియ ఎలా జరుగుతోంది.? సరఫరాదారుల ఎంపికలో నిబంధనలు పాటిస్తున్నారా.? అవసరం లేని మందులను అధికంగా కొనుగోలు చేసి, అవసరమైన మందులను కొరతలో ఉంచుతున్నారా.? సరఫరా చేసినట్లు చూపిన మందులు వాస్తవంగా ఆసుపత్రులకు చేరాయా.? అని రోగుల బంధువులు ప్రశ్నిస్తున్నారు.

కమిషనర్ పర్యవేక్షణ ఏది.? మంత్రి స్పందన ఎప్పుడు.?

మందుల కొరతపై ఇప్పటికే ఫిర్యాదులు అందితే ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలేమిటి.? ఆయుష్ శాఖ కమిషనర్ ఎన్ని ఆసుపత్రులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.? బాధ్యులపై ఎన్ని చర్యలు తీసుకున్నారు.? ఆయుర్వేద వైద్యంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఎన్ని కార్యక్రమాలు నిర్వహించారు.? మరిన్ని ఆయుర్వేద డిస్పెన్సరీలను ఎందుకు పెంచడం లేదు.? ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఈ వ్యవహారంపై తక్షణమే స్పందించి సమగ్ర విచారణకు ఆదేశించాలనే డిమాండ్ ప్రజల నుంచి వినిపిస్తోంది.

ఏసీబీ, విజిలెన్స్ విచారణతో నిజాలు బయటపడాలి

మందుల కొనుగోళ్లు, తయారీ, నాణ్యత పరీక్షలు, రవాణా, నిల్వలు, ఆసుపత్రులకు పంపిణీ వరకు ప్రతి దశను ఏసీబీ, విజిలెన్స్ అధికారులతో స్వతంత్రంగా విచారణ చేయించాలని ప్రజలు కోరుతున్నారు. ప్రభుత్వ నిధులు ఖర్చు చేస్తున్నా రోగులకు మందులు అందకపోతే బాధ్యత ఎవరిది.? మందుల సరఫరాలో అక్రమాలు జరిగినట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటారా.? కేవలం నివేదికలతో సరిపెడతారా.? లేక బాధ్యులపై చర్యలు తీసుకుని ఆయుర్వేద వైద్యవ్యవస్థను ప్రక్షాళన చేస్తారా.? అన్నది వేచి చూడాలి.

కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరల కానుక

- అచ్చంపేటలో పథకాన్ని ప్రారంభించనున్న సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రవ్యాప్తంగా అర్హులైన మహిళలకు 'ఇందిరమ్మ చీరల' పంపిణీ చేపట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. రాజ్యాంగ దినోత్సవమైన నవంబర్ 26న నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. 'ఇందిరా మహిళా శక్తి' పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా దాదాపు కోటి మంది మహిళలకు రామచిలుక రంగు (ప్యారెట్ గ్రీన్) చీరలను అందించనున్నారు. ఆహార భద్రత లేదా రేషన్ కార్డు కలిగిన కుటుంబాల్లోని 18 ఏళ్లకు పైబడిన మహిళలను ఈ పథకానికి లబ్ధిదారులుగా ప్రభుత్వం ఎంపిక చేసింది. ఇందులో గ్రామీణ ప్రాంతాలకు చెందిన 65 లక్షల మంది, పట్టణ ప్రాంతాలకు చెందిన 35 లక్షల మంది మహిళలు ఉన్నారు. మొత్తం కోటి చీరల్లో 6.30 మీటర్ల పొడవు కలిగిన పాలిస్టర్ చీరలు 95 లక్షలు కాగా, 9 మీటర్ల పొడవు ఉండే పాలీ-కాటన్ చీరలు 5 లక్షలు ఉన్నాయి. స్థానిక చేనేత రంగాన్ని ప్రోత్సహించడంతో పాటు సిరిసిల్ల తదితర ప్రాంతాల్లోని నేత కార్మికులకు చేతినిండా పని కల్పించే ఉద్దేశంతో ఈ చీరల తయారీ బాధ్యతలను వారికి అప్పగించారు. ఈ పంపిణీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక మొబైల్ యాప్‌ను వినియోగిస్తున్నారు. అర్హులైన మహిళలు తమ గ్రామాలు, వార్డుల్లోని పంపిణీ కేంద్రాల వద్ద రేషన్ కార్డు, ఆధార్ వివరాలను సమర్పించి చీరలను తీసుకోవచ్చు. వాస్తవానికి ఈ కార్యక్రమాన్ని నవంబర్ 19న ప్రారంభించాలని తొలుత నిర్ణయించినప్పటికీ, అనివార్య కారణాలతో నవంబర్ 26కు రీషెడ్యూల్ చేశారు. జిల్లా కలెక్టర్లు, జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రుల పర్యవేక్షణలో ఈ పంపిణీ ప్రక్రియ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగనుంది.

మార్కెట్‌లో ఆ బ్యాచ్ వాటర్ బాటిళ్లు లేవు

- బిస్లరీ యాజమాన్యం వివరణ



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) ప్రముఖ ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్ తయారీ సంస్థ బిస్లరీ ఇంటర్నేషనల్ తమ ఉత్పత్తుల నాణ్యతపై ఫుడ్ సేఫ్టీ అండ్ స్టాండర్డ్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎఫ్ఎస్ఎస్ఏఐ) విడుదల చేసిన నివేదికపై మంగళవారం స్పష్టతనిచ్చింది. ఈ వివాదం కేవలం 2025 సెప్టెంబర్‌లో తమ గోవా ప్లాంట్‌లో ఉత్పత్తి అయిన ఒక్క బ్యాచ్‌కు మాత్రమే పరిమితమని సంస్థ వెల్లడించింది. ఆ బ్యాచ్ స్టాక్ ప్రస్తుతం మార్కెట్‌లో ఎక్కడా అందుబాటులో లేదని స్పష్టం చేసింది. తమ ఉత్పత్తి నమూనా పరీక్షల్లో విఫలమై, పరిమితికి మించి బ్రోమేట్ ఉన్నట్లు తేలడంతో పాటు, అనంతరం నిర్వహించిన రెఫరల్ ల్యాబ్ పరీక్షల్లో ఆరోగ్యానికి హాని కలిగించే పాలిన్యూక్లియర్ ఆరోమాటిక్ హైడ్రోకార్బన్లు (పీఏహెచ్) బయటపడటంతో బిస్లరీ ఇంటర్నేషనల్‌పై ప్రాసిక్యూషన్‌కు ఎఫ్ఎస్-ఎస్ఏఐ అనుమతినిచ్చింది. చట్టప్రకారం రెఫరల్ ల్యాబ్ నివేదికే తుది నిర్ణయమని పేర్కొన్న నియంత్రణ సంస్థ, బ్యాచ్ నంబర్ +ూ 270 అమ్మకాలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. సమస్య తలెత్తడానికి గల మూల కారణాలను విశ్లేషించాలని బిస్లరీకి సూచించింది. ఈ పరిణామాలపై స్పందించిన బిస్లరీ, తాము ఏడాదికి 50,000 కంటే ఎక్కువ బ్యాచ్‌లను ఉత్పత్తి చేస్తామని, ఎఫ్ఎస్ఎస్ఏఐ జారీ చేసిన విక్రయాల నిషేధం కేవలం 2025 సెప్టెంబర్ 27న గోవాలో తయారైన బ్యాచ్ నంబర్ జీవో 270కి మాత్రమే వర్తిస్తుందని తెలిపింది. తదుపరి నిర్వహించిన పరీక్షల్లో బ్రోమేట్ స్థాయిలు అనుమతించదగిన పరిమితుల్లోనే ఉన్నట్లు తేలిందని కంపెనీ పేర్కొంది. అంతేకాకుండా, రీ-టెస్టింగ్‌లో పరిశీలించిన ఆరు నమూనాలలో ఒకదానిలో మాత్రమే పీఏహెచ్ ఉన్నట్లు తేలగా, అదే బ్యాచ్‌కు చెందిన మరొక శాంపిల్ అన్ని ప్రమాణాలను విజయవంతంగా క్లియర్ చేసిందని వివరించింది. ఈ వ్యత్యాసాలను గుర్తించి 2026 ఫిబ్రవరిలో తాము పీఏహెచ్‌పై పునఃపరీక్షలను కోరామని, అప్పటి నుంచి దేశవ్యాప్తంగా తమ ప్లాంట్లలో ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్వహించిన ఏ పరీక్షలోనూ పీఏహెచ్ ఉనికి కనిపించలేదని యాజమాన్యం వెల్లడించింది. దేశవ్యాప్తంగా ఉన్న తమ 143 తయారీ ప్లాంట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు అనుగుణంగా పూర్తిగా పని చేస్తున్నాయని, గోవా ప్లాంట్ విషయంలోనూ ఎలాంటి మూసివేత ఆదేశాలు రాలేదని బిస్లరీ స్పష్టం చేసింది. వినియోగదారుల ఆరోగ్య భద్రతకు, అత్యున్నత నాణ్యతా ప్రమాణాలకే తమ తొలి ప్రాధాన్యమని సంస్థ పునరుద్ఘాటించింది.

మా అవినీతికి అడ్డులేదు

- అనుమతులు లేకుండానే ఎనిమిది అంతస్తుల అక్రమ నిర్మాణం.?
- అయ్యప్ప సొసైటీలో ప్లాట్ నంబర్ 144లో బిల్డర్ బరితెగింపు
- గత వారం ప్రజాప్రశ్నలో కథనం ప్రచురించినా కదలని సీఎంసీ అధికారులు
- టౌన్ ప్లానింగ్ అధికారులపై లక్షల రూపాయల ముడుపుల ఆరోపణలు
- అక్రమ నిర్మాణాలకు అడ్డుకట్ట వేయలేని మున్సిపల్ యంత్రాంగం
- మున్సిపల్ శాఖలో విజిలెన్స్ విభాగం ఉన్నట్టా.? లేనట్టా.?



శేర్లింగంపల్లి (ప్రశ్న న్యూస్) నగరంలో అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నా అడ్డుకోవాల్సిన మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారా.? భవన నిర్మాణాలకు అనుమతులు ఉన్నాయా.? లేవా.? అనే విషయాన్ని పరిశీలించాల్సిన టౌన్ ప్లానింగ్ విభాగం నిద్రావస్థలోకి వెళ్లిందా.? లేక అక్రమ నిర్మాణదారులతో కుమ్మక్కై చూసీచూడనట్లు వ్యవహరిస్తోందా.? అన్న ప్రశ్నలు ఇప్పుడు ప్రజల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారుతున్నాయి.మాదాపూర్ సర్కిల్ పరిధిలోని అయ్యప్ప సొసైటీలో ప్లాట్ నంబర్ 144లో ఏడు, ఎనిమిది అంతస్తుల భారీ భవన నిర్మాణం జరుగుతున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. బిల్డర్ ఎలాంటి నిర్మాణ అనుమతులు లేకుండానే ఇంతటి భారీ నిర్మాణాన్ని చేపడుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం జరుగుతోందని స్థానికులు చెబుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు మాత్రం స్పందించకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

వార్త ప్రచురించినా అధికారుల్లో చలనం లేదా.?

గత నవంబర్ 18న ప్రజాప్రశ్న దినపత్రికలో ఈ అక్రమ నిర్మాణంపై ప్రత్యేక కథనం ప్రచురించింది. అయినప్పటికీ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) మాదాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పత్రికల్లో వార్తలు వచ్చినా, ప్రజలు ఫిర్యాదులు చేసినా అధికారుల చెవికి ఎక్కకపోవడం వెనుక అసలు కారణమేమిటి.? లక్షలలో లంచాలు తీసుకొని చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయ్యప్ప సొసైటీ అంటేనే అక్రమ నిర్మాణాల అడ్డ అందులో అధికారులకు కాసుల పంట మరి ఇంత అవినీతి అక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వం ఎందుకు స్పందిస్తలేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

లక్షల ముడుపుల ఆరోపణలు.. చర్యలు మాత్రం శూన్యం

అక్రమ నిర్మాణాలకు కొందరు టౌన్ ప్లానింగ్ అధికారుల అండదండలు పూర్తిస్థాయిలో ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. లక్షల రూపాయల ముడుపులు చేతులు మారుతున్నాయనే స్థానికుల అనుమానాలపై ఉన్నతాధికారులు విజిలెన్స్ అధికారులతో సమగ్ర విచారణ జరిపించాల్సిన అవసరం ఉంది. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరిగితే చైన్ మెన్, సెక్షన్ ఆఫీసర్, ఏసీపి, డిప్యూటీ కమిషనర్లపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వెంటనే సస్పెండ్ చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

విజిలెన్స్ విభాగం ఏం చేస్తున్నట్లు.?

మున్సిపల్ శాఖలో అక్రమ నిర్మాణాలు, అధికారుల నిర్లక్ష్యం, అవినీతి ఆరోపణలను పర్యవేక్షించాల్సిన విజిలెన్స్ వ్యవస్థ ఎక్కడ పనిచేస్తోందో అర్థంకాని పరిస్థితి నెలకొంది. నగరంలో ఎక్కడ చూసినా అక్రమ నిర్మాణాల ఆరోపణలు వినిపిస్తున్నా ఆకస్మిక తనిఖీలు, విచారణలు, బాధ్యులపై కఠిన చర్యలు అసలే



కనిపించడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. విజిలెన్స్ అధికారులకు జీతాలు వృధా అవుతున్నాయని వాళ్లకు పెట్టె ఖర్చులు కూడా ప్రభుత్వంకి వృధా అవుతూ వాళ్లని కేవలం కాలక్షేపం కోసమే నియమించినట్లు మారిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కమిషనర్ స్పందించేది ఎప్పుడు.?

ఇప్పటికైనా సీఎంసీ కమిషనర్, ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై ప్రత్యేక దృష్టి సారించాలి. ప్లాట్ నంబర్ 144లో నిర్మాణ అనుమతులు, అనుమతించిన అంతస్తులు, క్షేత్రస్థాయి నిర్మాణ స్థితిపై తక్షణమే విచారణ జరిపించాలి. ఎలాంటి అనుమతులు లేకుండా నిర్మాణం జరుగుతున్నట్లు తేలితే పనులు నిలిపివేసి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. అధికారుల బాధ్యతారాహిత్యం పై కమిషనర్ వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలకు సహకరిస్తున్న అధికారులు వెంటనే సస్పెండ్ చేయాలని స్థానికులు కోరుతున్నారు.

అక్రమ నిర్మాణదారులపై చర్యలు తీసుకునే ధైర్యం ఉన్నత జూ అధికారులకు ఉందా.? లేక పత్రికల్లో కథనాలు వచ్చినా, ప్రజలు ప్రశ్నించినా లంచాలు తీసుకున్నామని మౌనమే సమాధానమా.?

చేతులకు బేడీలు వేసే తీసుకొస్తాం

- షేక్ హసీనాకు బంగ్లాదేశ్ తీవ్ర హెచ్చరిక



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) భారత్‌లో ఉంటున్న బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాను స్వదేశానికి తీసుకొచ్చే విషయంలో ఢాకా ప్రభుత్వం తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ప్రత్యేక విమానం పంపాలన్న ఆమె డిమాండ్‌ను బంగ్లాదేశ్ అధికారులు కొట్టిపారేశారు. హసీనా సాధారణ ప్రయాణికురాలు కాదని, చేతులకు, కాళ్లకు బేడీలు వేసి కట్టుదిట్టమైన భద్రత మధ్య ఖైదీగానే తీసుకొస్తామని విదేశాంగ శాఖ సహాయ మంత్రి హుమాయున్ కబీర్ స్పష్టం చేశారు. డిసెంబర్ 16 విజయ్ దివస్ సందర్భంగా ప్రత్యేక విమానం పంపాలన్న హసీనా అభ్యర్థనను అంతర్జాతీయ నేరాల ట్రైబ్యునల్ చీఫ్ ప్రాసిక్యూటర్ ఎండీ అమీనుల్ ఇస్లాం ఎద్దేవా చేశారు. మరోవైపు, ఆమె అప్పగింతపై భారత్‌తోనే చర్చలు జరుపుతామని ప్రధాని సమాచార సలహాదారు జూహెద్ ఉర్ రెహమాన్ వెల్లడించారు. హసీనా తిరిగి వచ్చే అంశంతో బంగ్లాదేశ్‌లో రాజకీయ ఉద్రిక్తతలు పెరిగాయి. దేశంలో జరుగుతున్న హింసాకాండ వెనుక నిషేధిత అవామీ లీగ్ శక్తులున్నాయని ప్రభుత్వం ఆరోపించింది. ఈ పరిణామాలపై భారత్ సహా దాదాపు 60 దేశాల దౌత్యవేత్తలకు బంగ్లాదేశ్ వివరాలు అందించింది.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.no : 12-13-1282, Flat No : 407, Mehtab Arcade, Tarnaka Main Road, Opp.Ganesh Temple, Secunderabad - 500017, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588